చోరీల నియంత్రణకు గస్తీ ముమ్మరం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చోరీల నియంత్రణకు పగలు, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) పోలీస్ సిబ్బందితో శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పరవాడలోని ఏటీఎంలో నిందితులు వాడినట్లు అనుమానిస్తున్న వాహనం కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో జరిగిన చోరీలో పట్టుబడిన వాహనంతో సరిపోలడంతో పీటీ వారెంట్‌లో నిందితులను ఇక్కడికి రప్పించి విచారణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న చోరీలు ఏ విధంగా జరుగుతున్నాయో తెలుసుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై సిబ్బందికి సూచనలు చేశారు. చోరీల్లో పోగొట్టుకున్న సొత్తు వసూలు శాతాన్ని పెంచేలా ఎస్సైల నేతృత్వంలో క్రైం టీంలను ఏర్పాటుచేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌తో అనుమానాస్పద వ్యక్తుల వేలి ముద్రలు సేకరించాలన్నారు. జైలు నుంచి విడుదలైన నిందితుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఊళ్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు పెట్టడంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అదనపు ఎస్పీ క్రైం ఎల్. మోహనరావు, సీసీఎస్ ఎస్సైలు రమేశ్, సత్యనారాయణ, ప్రసాద్, ఫణిదాసు పాల్గొన్నారు.



హోంమంత్రితో ఎస్పీ భేటీ

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుహిన్ సిన్హా శుక్రవారం హోం మంత్రి అనితను మర్యాద పూర్వకంగా కలిశారు. నక్కపల్లిలోని ఆమె క్యాంపు ఆఫీసులో పూల మొక్కను అందజేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

నాతవరం, న్యూస్‌టుడే: నాతవరం మండలం తాండవ కూడలి వద్ద శుక్రవారం గంజాయి తరలిస్తూ ముగ్గురు యువకులు పోలీసులకు దొరికారు. ఎస్సై భీమరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాండవ కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ప్రశ్నించారు. వారివద్ద మూడు చరవాణిలు, 4 కేజీల గంజాయిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


నక్కపల్లిలో నంజుకుంటున్నారు...!

తీరంలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

ఈనాడు, అనకాపల్లి – న్యూస్‌టుడే, నక్కపల్లి

ఇసుక బంగారంలా మారింది. అక్రమార్కులకు కాసులు కురిపిస్తుండగా, ప్రభుత్వాదాయానికి, పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ముఖ్యంగా నక్కపల్లి మండలంలోని తీర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించుకు పోతుండగా, అధికార యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది.

నక్కపల్లి మండలంలో నదులు, కాలువలు లేకపోయినా.. సముద్రతీర ప్రాంతం దోపిడీదారులకు ఆదాయ వనరుగా మారిపోయింది. ప్రధానంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించి అధికారికంగా నక్కపల్లి డిపో ఒక్కటే మాత్రమే ఉంది. దీన్లో నిల్వలు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి తరలించడం ఆలస్యం అవుతుండటంతో కొందరు తీరప్రాంతంపై కన్నేశారు. వీరి అడ్డగోలు తవ్వకాలకు కొందరు నాయకులు సహకరిస్తున్నారు. వారికి లంచాలకు మరిగిన ఉద్యోగులు సైతం వంత పాడుతున్నారు. ముఖ్యంగా అమలాపురం, డీఎల్‌పురం ప్రాంతాల్లో ఇసుకపైనే అందరి కళ్లు పడ్డాయి. ఇక్కడ ఉప్పుటేరు కలిసిన ప్రాంతంలో సాధారణ ఇసుక మాదిరిగా ఉండటంతో వీరి పంట పండినట్లైంది. సముద్ర తీరాన్ని ఆనుకుని తోట భూముల్లో ఇలాంటి ఇసుక భారీగా ఉంది. ఈ భూములను ఏపీఐఐసీ పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం సేకరించింది. దీంతో అక్రమార్కులంతా కలిసి వీటిని కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడినుంచి పెద్దఎత్తున ఇసుక లారీలు, ట్రాక్టర్లలో తరలిపోతోంది. అడ్డుచెప్పిన వారిని లోబర్చుకుంటున్న అక్రమార్కులు కాసులతో వారి నోళ్లను కట్టేస్తున్నారు.



అమలాపురం తీర ప్రాంతంలో తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

ఉచిత విధానం అమలవుతున్నా..

ప్రభుత్వం ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలవుతోంది. జిల్లాలో నదులున్నా.. వాటిల్లో నిండుగా నీరుంది. దీంతో తవ్వకాలకు వీలు కావడం లేదు. మరోవైపు నర్సీపట్నం వద్ద గబ్బాడ యార్డులో వివాదం నెలకొని అమ్మకాలకు ఆటంకం కలిగింది. ఎట్టకేలకు ఇటీవలే విక్రయాలు మొదలయ్యాయి. ఇది గత ప్రభుత్వ హయాంలో గోదావరి ప్రాంతం నుంచి తెచ్చి నిల్వ చేయడంతో రవాణా ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. దీంతో 4 టన్నుల ఇసుక కొనుగోలుకు దాదాపు రూ. 4.5 వేలు అవుతుంది. ట్రాక్టరు/లారీ ద్వారా సరకు రప్పించుకోవడానికి అదనపు ఛార్జీలు చెల్లించాలి. దీంతో ఖర్చు అధికమవుతోంది. దీనికంటే తక్కువ ధరకు లభిస్తున్న అమలాపురం, డీఎల్‌పురం ప్రాంతాల్లోని ఇసుకను తరలించుకుపోతున్నారు. ఇలా రోజూ రూ.లక్షల రూపాయల విలువైన దందా జరుగుతోంది. ఎక్కువగా పరవాడ, అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్. ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇక తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో పది నుంచి ఇరవై అడుగుల లోతున మేర గుంతలు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే వాహన రాకపోకలకు వీలుగా మార్గాలు పెట్టారు. తవ్వకాలు రాత్రిళ్లు చేపట్టి, నిల్వ చేసిన సరకును దర్జాగా పగటి వేళల్లో తరలించుకుపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారులు సైతం దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా తీరప్రాంతానికి రక్షణగా నిలిచే తోటలు అడ్డగోలు తవ్వకాలతో దెబ్బతింటున్నాయి.

> **గడిచిన రెండు నెలల కాలంలో పోలీసులు పలుమార్లు దాడులు చేసి పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు తప్పితే.. మిగిలిన మైనింగ్, ఏపీఐఐసీ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు ఎవ్వరూ కనీసం పట్టించుకోలేదు.**

> **ఈ నెల ఒకటో తేదీన అమలాపురం ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వను గుర్తించిన అధికారులు వేలంవేసి రూ.1.03 లక్షలకు విక్రయించారు. ఇలాంటి గుట్టలెన్నో ఉన్నాయి.**



పట్టుకున్న ఇసుకకు ఇటీవల వేలం నిర్వహించిన అధికారులు

కఠిన చర్యలు తీసుకోవాలి




మా ప్రాంతంలోని సముద్రతీరం నుంచి రోజూ భారీఎత్తున సముద్ర ఇసుక తరలిపోతోంది. పోలీసులు తప్పితే మిగిలిన అధికారులు దీన్ని అడ్డుకోవడంలేదు. ఇప్పటికే దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేశాం, అయినా అధికారులు పట్టించుకోలేదు. ప్రధానంగా తీరం దెబ్బతినడంతో పాటు, రహదారులు పాడవుతున్నాయి. ఇటీవల మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లాను. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని తీరాన్ని రక్షించాలి.
– ఎరిపల్లి సత్తిబాబు, అమలాపురం

నిరంతర నిఘా



తీర ప్రాంతాల్లో ఇష్టానుసారం ఇసుకను తవ్వడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వాటిలో తవ్వకాలు చేస్తే ఉపేక్షించం. ఇప్పటికే దాడులు చేసి పదుల సంఖ్యలో కేసులు పెట్టి, జరిమానా విధించాం. స్వాధీనం చేసుకున్న నిల్వలను రెవెన్యూ అధికారుల సమక్షంలో వేలం వేయించారు. తీరప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు. దీన్ని అరికట్టడానికి నిరంతర నిఘా పెట్టాం. స్థానికులు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటాం.
– కె.కుమారస్వామి, సీఐ, నక్కపల్లి

అడ్డుకట్ట వేస్తాం



తీరప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించి చర్యలు చేపట్టడానికి కార్యాచరణతో సిద్ధమవుతున్నాం. ఆ మేరకు మైనింగ్, పోలీసు అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతాం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.
– ఆర్.నరసింహమూర్తి, తహసీల్దారు, నక్కపల్లి

పశుగణన ప్రారంభం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పశుగణనకు ప్రజలు సహకారం అందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం పశుగణన గోడపత్రికలు, కిట్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ పశుగణన కింద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు నెలల్లో ఈ గణన పూర్తి చేయాలన్నారు. 24 గ్రామీణ మండలాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లోనూ పశుగణన చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి గేదెలు, ఆవులు, కోళ్లు, మేకలు తదితర 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగే పశుగణనకు 294 ఎన్యుమరేటర్లు, 59 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పశుగణన పక్కాగా చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే గణన పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ సైతం పూర్తి చేశామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పశుసంపద వివరాలను యాప్‌లో నమోదు చేస్తామన్నారు. జేసీ జాహ్నవి, అధికారులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి తదితరులు

డీఆర్వోగా సత్యనారాయణ.. దయానిధికి దక్కని పోస్టింగ్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారిగా వైఎస్‌వీకేజీఎల్ సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు అనకాపల్లికి కేటాయించారు. ఇక్కడ డీఆర్వోగా ఉన్న దయానిధికి ప్రభుత్వం ఎక్కడికీ కేటాయించలేదు. విజయవాడలోని సాధారణ పరిపాలన విభాగానికి రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం మూడు నెలలు పాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి మళ్లీ విధుల్లో చేరారు. పోస్టింగ్ ఇవ్వకపోవడంపై అయోమయం నెలకొంది. కొత్త డీఆర్వో సత్యనారాయణ శనివారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

జంగాలపల్లిలో జగడం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలం జంగాలపల్లి వద్ద ఇసుక తవ్వకాలపై రెండు ప్రధాన పార్టీల నాయకుల మధ్య శుక్రవారం వివాదం తలెత్తింది. సర్పానదిని ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమిలో ఉన్న ఇసుకను రైతుల నుంచి వైకాపా నాయకులు కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఈ ఇసుక తవ్వకాల్లో తమకూ వాటాలు కావాలని తెదేపా నాయకులు డిమాండ్ చేయడంతో శుక్రవారం ఇరు పార్టీలవారి మధ్య వివాదం తలెత్తి కొట్లాటస్థాయికి చేరుకుంది. దీంతో జంగాలపల్లి గ్రామస్థులు, నది పరివాహక ప్రాంత పొలాల రైతులు తవ్వకాలను అడ్డుకున్నారు. కొంతమంది స్వలాభం కోసం నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న తవ్వకాల కారణంగా వరదలు వచ్చినప్పుడు నది పొంగి ఊరిలో పొలాలను మొత్తం ముంచేస్తోందంటూ ఆందోళనకు దిగి ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను అడ్డుకోకపోతే రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



సర్పానదిలో ఇసుక తవ్వకాలు

రోడ్డు భద్రతపై అవగాహన తూతూమంత్రమేనా!

మానవ హారం ఊసేలేదు!



తహసీల్దార్ కార్యాలయం వద్ద వెలుగు సిబ్బంది, అధికారుల ర్యాలీ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అచ్యుతాపురం వెలుగు సిబ్బంది నామమాత్రంగా పాటిస్తున్నారు. రోడ్డు భద్రతపై ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేయాలనే ఆదేశాలను పట్టించుకోలేదు. స్త్రీశక్తి భవనం నుంచి కేవలం 100 మీటర్లు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగించారు. అక్కడే మానవహారం ఏర్పాటుచేసి నినాదాలు చేసి వెనుతిరిగారు. దీనికి మండలంలో పనిచేసే వీఓఏలు, సీసీలు, డ్వాక్రా మహిళలను రప్పించారు.

సిబ్బంది బదిలీ.. శాంతించిన విద్యార్థినులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహంలో వంట పని వారిని, కాపలాదారుని మార్చారు. శుక్రవారం కొత్తవారిని నియమించారు. కొత్త పనివారు విధుల్లో చేరడంతో విద్యార్థులు శాంతించారు. వసతి గృహంలో భోజనం బాగోలేదని వంట మనుషులు సరిగా వండటంలేదని, కాపలాదారు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై వంటావార్పు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని మార్చి వేరే వసతి గృహాల నుంచి సిబ్బందిని ఇక్కడ నియమించారు. శుక్రవారం వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడగా, కొత్త సిబ్బంది భోజనం బాగా వండుతున్నారని చెప్పారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఒమ్మలి విద్యార్థినులు



సుప్రియ, గీతామాధురి

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: లంకెలపాలెంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో ఒమ్మలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కె.జగన్మోహన్‌నాయుడు తెలిపారు. అండర్-14లో కె. సుప్రియ, అండర్-17 విభాగంలో డి.గీతామాధురి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటరావును ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఉగ్గిన శ్రీనివాసరావు, గ్రామపెద్దలు అభినందించారు.



రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా రగ్బీ జిల్లా స్థాయి జట్ల ఎంపిక అచ్యుతాపురంలో శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ క్రీడాకారులు 27న నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ పోటీలకు ఆర్.బాల, డి.వసంత, ఎన్.లీలా, పి.రేఖ, జి.భారతి, బి.సంధ్య, వి.స్వర్ణలేఖ, కె.ప్రవల్లిక, ఎస్.షర్మిల, పి.గంగాభవాని, జి.కావ్య, ఎస్.కుసుమ, వి.రమ్య, మానస, పి.మానసలను ఎంపిక చేసినట్లు శిక్షకుడు వెంకట్ తెలిపారు. ఈ క్రీడాకారులను కూండ్రపు వెంకునాయుడు, రెడ్డి చిరంజీవి, వెంకట్, సుధీర్, జగదీష్ అభినందించారు. పీడీ శివాజీ, పీఈటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

రూ.40 వేలకు వెలకట్టిన పెద్దలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రం అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో ఇంటర్ విద్యార్థినిపై ఓ యువకుడు తాగిన మైకంలో అత్యాచారానికి యత్నించిన ఉదంతం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. గ్రామపెద్దల పంచాయితీలో రూ.40 వేలకు వెలకట్టే ప్రయత్నాలూ బెడిసికొట్టాయి. దీనిపై బాధితురాలి బంధువులు, పోలీసుల కథనం ఇలా ఉంది.. సెజ్ రోడ్డులో నివాసం ఉంటున్న ఓ పేద కుటుంబానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఇంటి వద్ద ఉండగా గ్రామానికి చెందిన యువకుడు ఈ నెల 19న రాత్రి 9 గంటల ప్రాంతంలో బాలికకు ఫోను కాల్ చేశాడు. ఆమె తల్లి గురించి అసభ్యకరంగా మాట్లాడాడు. దీనిపై ప్రశ్నించడానికి వెళ్లిన ఈ బాలికను యువకుడు బలవంతంగా లొంగదీసుకోవడానికి ప్రయత్నించాడు. అప్పటివరకు ఇంటివద్దే ఉన్న కుమార్తె కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికింది. ఆమె రావడం గమనించి యువకుడు పారిపోయాడు. ఈ విషయాన్ని బాధితులు గ్రామానికి చెందిన పెద్ద మనిషి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన యువకుడిని మందలించి పంపేశాడు. దీనిపై తల్లి అసంతృప్తి వ్యక్తం చేయడంతో రూ.20 వేలు ఇస్తామని బేరం పెట్టారు. శుక్రవారం విషయం వెలుగులోకి రావడంతో ఈ మొత్తాన్ని రూ.40 వేలకు పెంచారు. బాలిక సామాజిక వర్గానికి చెందిన పెద్దలకూ ఈ విషయం తెలియడంతో దీనిపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరవాడ డీఎస్పీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా బాలికపై యువకుడు అత్యాచారయత్నించాడని, దీనిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కూరగాయల మంట.. ఊరటనిచ్చిన టమాటా

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మార్కెట్‌లో కూరగాయ ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. గతవారం తగ్గినట్లే కనిపించిన వీటి ధరలు ప్రస్తుతం మళ్లీ పెరిగాయి. ముఖ్యంగా ఉల్లి ధర ఘాటెక్కుతోంది. టమాటా ఆందుబాటులోకి వస్తుండటం కాస్త ఊరటనిచ్చే అంశం. నర్సీపట్నంలో శుక్రవారం జరిగిన వారపు సంతలో ఉల్లి నాణ్యతను బట్టి కేజీ రూ. 50 నుంచి రూ. 70 వరకు విక్రయించారు. టమాటా రూ. 50కి దిగింది. గతవారం రూ. 120 పలికిన చిక్కుడు కాయలు ఈ వారం ఏకంగా రూ. 150కు చేరాయి. బెండ, వంకాయ, గోరు చిక్కుడు రూ. 70 ఉన్నాయి. బంగాళదుంపలు, దొండకాయలు రూ. 40 పలికాయి.



గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట మండలం నామవరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి దగ్గర జాతీయ రహదారి పక్కన నక్కపల్లి వైపు నుంచి తుని వచ్చే మార్గంలో మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై అప్పన్న చెప్పారు. మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. శవ పంచనామా నిమిత్తం నక్కపల్లి ఆసుపత్రిలో భద్రపరిచామని తెలిపారు. వివరాలకు 9440796106, 8328580990, 7013335165 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

రోలుగుంట, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ చూపారు. వీరిని పలువురు ప్రశంసించారు. అండర్ 14 బాలికలు, బాలుర విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి టెన్నికాయిట్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు బుచ్చెంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.ద్రాక్షాయని ఎంపికైంది. ఉమ్మడి జిల్లాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఈమె ప్రతిభను కనబరిచి, రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శేఖర్ తెలిపారు.



ఉపాధ్యాయులతో ద్రాక్షాయని

రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ

మునగపాక, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు మునగపాక ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆడారి మౌనిక అన్నపూర్ణను శుక్రవారం తెదేపా కార్యాలయంలో సత్కరించారు. బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ కోరారు. తెలుగు యువత కన్వీనర్ వెంకటేశ విజయ్, నాయకులు ఆడారి సూర్యచంద్రరావు, సూరకసింగారావు తదితరులు పాల్గొన్నారు.

☛ నెహ్రూచౌక్ (అనకాపల్లి): భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బృందగాన పోటీల్లో అనకాపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. రాజమహేంద్రవరంలో భారత వికాస్ పరిషత్ ప్రాంత ఈ పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర బృందగాన పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 27న తెలంగాణలో జరిగే జాతీయ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని భారత వికాస్ పరిషత్ ఎన్ఎస్వీ వర్మ పేర్కొన్నారు.



మౌనిక అన్నపూర్ణను సత్కరిస్తున్న నేతలు



విద్యార్థులతో పరిషత్ సభ్యులు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి పాతికేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 25 ఏళ్ల కారాగార శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలికి అందించాలన్నారు. దీనికి అదనంగా రూ. 4లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సాది పోలారెడ్డి(57) రెడ్డి కంచరపాలెం బుసిపాలవీధిలో నివసిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఒక కుమార్తె(9) ఉంది. బాలిక ఆడుకునేందుకు నిత్యం పోలారెడ్డి ఇంటికి వెళ్లేది. 2023 ఆగస్టు 24న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని తల్లి భావించింది. 26వ తేదీ సాయంత్రం కుమార్తె ఇంటికి రావడంతో ఎక్కడికెళ్లావని నిలదీసింది. పోలారెడ్డి ఇంట్లో ఉన్నట్లు తెలిపింది. అనుమానంతో పదేపదే ప్రశ్నించడంతో అతను తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని పోక్సో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.


చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	105	100
లైవ్	127	120
డ్రెస్డ్	184	210
స్కిన్‌లెస్	210	220

ద్విచక్ర వాహనం అదుపుతప్పి చిరు వ్యాపారి మృతి

రోలుగుంట, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టక రోలుగుంట సమీపంలో అధ్వానంగా తయారైన భీమునిపట్నం - నర్సీపట్నం (బీఎన్) రోడ్డు ఓ యువకుడి నిండుప్రాణాన్ని బలితీసుకుంది. వ్యాపార పనుల ముగించుకుని నర్సీపట్నం నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తకోట వైపు వస్తుండగా రోలుగుంట సమీపాన కొత్తవలస మలుపు వద్ద వాహనం అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కోట దొరబాబు (35) అదే గ్రామంలో చిరు వ్యాపారి. వ్యాపార పనుల నిమిత్తం శుక్రవారం నర్సీపట్నం వెళ్లి సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా రోడ్డు మధ్యలో గుంతలు తప్పించబోయి అతను అదుపుతప్పడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దొరబాబు ముఖం, తల భాగాలకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదస్థలంలోనే చాలాసేపు కొన ఊపిరితో కొట్టుమిట్టాడినట్లు స్థానికులు తెలిపారు. ఆ మార్గాన వెళ్తున్న వారెవరూ స్పందించకపోవడంతో కొద్దిసేపటికి ప్రాణాలు వదిలాడు. సమాచారం తెలుసుకున్న రోలుగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



దొరబాబు (పాత చిత్రం)



బ్యాంక్ ఆఫ్ బరోడా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda 117

సీతమ్మధార బ్రాంచ్, డోర్ నెం.50-53-11/8, రవి ప్లాజా, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఫోన్: 0891-2552472, మొబైల్: 7995565152, ఇ-మెయిల్: savsee@bankofbaroda.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX- IV-A [SEE PROVISO TO RULE 6 (2) & 8 (6)]

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6(2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు)కు తెలియచేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి తనఖా / ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తిని "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అసెట్స్/లు/బకాయిలు/రిజర్వ్ ధర/ఇ-వేలం తేది & సమయం, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువున పేర్కొనబడినవి.

వ. నెం.	ఋణగ్రహీతలు / హామీదారుల / తనఖాదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	బకాయి మొత్తము	ఇ-వేలం తేది & సమయం	రిజర్వు ధర, ధరావత్తు & బిడ్ పెంపుదల మొత్తం
1	M/s సంతోషి ఇంజినీరింగ్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ట్‌నర్లు: 1. శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, తండ్రి: బొక్కా కృష్ణారావు, 2. శ్రీమతి బొక్కా వరలక్ష్మి, భర్త: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు మరియు హామీదారులు: 1. శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, తండ్రి: బొక్కా కృష్ణారావు, 2. శ్రీమతి బొక్కా వరలక్ష్మి, భర్త: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు.	విశాఖపట్నం జిల్లా, యలమంచిలి రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, అచ్యుతాపురం మండలం, వెదురువాడ గ్రామం మరియు పంచాయతీ, ఎస్.నెం. 27/పి, ఎల్.పి. నెం.25/2005/వి ద్వారా డి.టి.సి.పి, హైదరాబాద్ ఆమోదించిన లేఅవుటు, "సాయి ప్రియ గార్డెన్-II" ప్లాట్ నెం. 57 లోని 200 చ॥గ॥ లేదా 167 చ॥మీ॥ స్థలం. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 58, దక్షిణం: ప్లాట్ నెం.76, పడమర: ప్లాట్ నెం.56, ఉత్తరం: 33 అ॥ రోడ్డు. తనఖాదారు: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, శ్రీమతి బొక్కా వరలక్ష్మి	రూ. 83,46,351.21 (అక్షరాల ఎనభై మూడు లక్షల నలభై ఆరు వేల మూడు వందల యాభై ఒకటి రూపాయల ఇరవై ఒకటి పైసలు) + రివర్సల్ ఆఫ్ అన్ రియలైజ్డ్ వడ్డీ + తేది 01.10.2023 నుండి వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు.	తేది: 27.11.2024 మ॥ 02.00 గం.ల నుండి సా॥ 06.00 గం.ల వరకు (వేలం ముగిసేవరకు ప్రతీ 10 నిమిషాలకు ఒకసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును)	రిజర్వు ధర: రూ. 36,00,000/- (అక్షరాల ముప్పై ఆరు లక్షల రూపాయలు మాత్రమే) ధరావత్తు: రూ. 3,60,000/- (అక్షరాల మూడు లక్షల అరవై వేలరూపాయలు మాత్రమే) బిడ్ పెంపుదల మొత్తం: రూ. 25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)

స్వాధీనం యొక్క స్వభావము: భౌతిక స్వాధీనం ; ఆస్తి తనిఖీ యొక్క తేది & సమయం: తేది 12.11.2024 నుండి ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 4:00 గం.ల వరకు

అమ్మకం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ లింకును https://www.bankofbaroda.in/e-auction.htm రిఫర్/చూడండి మరియు ఆన్‌లైన్ అమ్మకం పోర్టల్ https://ebkray.in ను కూడా చూడవచ్చును. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి: శ్రీ. మెహర్ ప్రకాశ్ చంద్ర గారిని మొబైల్ నెం. 7995565152 నందు సంప్రదించవచ్చును.

తేది: 25.10.2024, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్ / ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును మిగిలిన డబ్బు తక్షణమే ఇవ్వబడును. స్పాట్ క్యాష్ EV. Golds 7075086333.

మీ బంగారాన్ని బ్యాంకు/ తాకట్టులో ఉన్నవి విడిపించి మార్కెట్ ధర ప్రకారం కొనబడును. 916 బంగారు నగలు ఆర్డరుపై తయారు చేయబడును. ✆ 8106919069.

FINANCIAL SERVICES

తక్కువ వడ్డీతో లోన్స్ * ఇళ్ళ స్థలాలు, పొలాలు, స్కూల్స్ / కాలేజీలు, ఫ్యాక్టరీలు, సొసైటీ ఆస్తులపై / ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. బ్యాంకులో ఉన్నా ఇవ్వబడును, నో సిబిల్ & బ్రోకర్స్, M.S.R. గ్రూప్, వైజాగ్. సంప్ర॥ 7095322311.

HOME NEEDS

INTERIOR DECORATORS

Looking for best interiors? DREAMHUTZ INTERIORS: Get 10% off on wardrobes and modular kitchens! Call: 9948151289 for more details.

MARRIAGE SERVICES

మీ అమ్మాయి/ అబ్బాయికి పెళ్లి సంబంధం చూడాలనుకుంటున్నారా? కాపు, తెలగ, వెలమ, రాజులు, గవర, యాదవ్, SC, ST క్రిస్టియన్ 1st, 2nd అన్ని కులాలవారికి చూడబడును (సిద్దు) ✆ 7997019690.

PEOPLE CARE

OLD AGE HOME

మదర్ & ఫాదర్ హోమ్ నర్సింగ్ సర్వీసెస్. గురుద్వారా! వృద్ధులకు, బెడ్ పేషెంట్లకు సర్వీసు చేయుటకు కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులను మీ ఇంటి వద్దకే పంపించబడును. ✆ 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

BEACH ROAD

2560 Sft Ready to Occupy, Each 5 Floors North face, 80 Scyds UDS, 2 Car parkings, Prime area, RK Beach Road, Pandu Ranga puram. Contact: 8978763496.

700 Sft., 1BHK Flat. 3rd Floor F.No. 308, Chinawaltair, Visakhapatnam. Near RK Beach. 8585869660, 9032600229.

DWARAKANAGAR

FLAT FOR SALE
3 BHK 1260 Sft
E/W Seethampeta Main Road, Beside Central Bank
3 BHK 1450 Sft
N/S Dwarakanagar
Near Boy London Showroom
Commercial & Residential
* UNDER CONSTRUCTION *
98494 27319

MADHURAWADA

2&3BHK Flat for Sale. Gated Community at affordable Prices Madhurawada & Tagarapuvalasa. Contact: 9652916699/ 9573518899.

2BHK 1080 Sft. East and 3BHK 1440 West Facing Flats with Super Delux Specifications for Sale at P.M.Palem Last Bus Stop. 8886247888.

Ready to Occupy 3 BHK 1445 SFt. Luxurious Flat (No GST) Opp. Cine Polis IT Hub Rd., Midhilapuri Colony, Madhurawada 9849551444.

945 Sft. 2BHK East Facing, 1st Floor with Car Parking & Lift in Anandh Arcade behind D-Mart Madhurawada. UDS 42 Sqyds. ✆ 8008521988, 9440120484.

మధురవాడ: 3BHK 1340 Sft ఈస్ట్ ఫేసింగ్ & 1300 SF నార్త్ ఫేసింగ్ రెడీటు ఆక్యూపై ఫ్లాట్స్ కలవు. నేషనల్ హైవేకు 250 మీ॥ దూరంలో కారు పార్కింగ్, లిఫ్ట్, జనరేటర్ సదుపాయంతో కలదు. మధురవాడ నందు 600 చ॥గ॥ స్థలం LP. No: 06/2024 అభిమాంజ కనస్ట్రక్షన్స్. డైరెక్ట్ పార్టీస్. ✆ 9849482739, 7702633826.

MVP COLONY

1000Sft 2BHK East Facing 3 Years Old, Including Interiors at MVP Colony Sector -5, Simhadri Homes Appt. Cont: 9494332914.

YENDADA


FLATS FOR SALE
Gated Community, 2 BHK, 1225 Sft. & 1110 Sft., NEW FLATS, Vaisakhi Skyline, Yandada, Vizag with ATTRACTIVE PRICE
8184815118 8520957200

Flat for Sale. 850-100 SFt. Car Parking, 2 BHK Flat 408, MVV Harmony, Nr: HDFC Bank, Yendada Jn. 44 Lakh. Ph: 8989732152.

GENERAL

Apt sale East Pt Colony 1845 sft East fcng 5 min from VUDA park. Ph: 7680944577, 9949496338

FLATS FOR SALE
READY TO OCCUPY



GATED COMMUNITY
In the HEART of the CITY
PEDDAWALTAIR, VISAKHAPATNAM
GROUND AND FIRST FLOOR FLATS ONLY AVAILABLE
CONTACT: 7382516799 8309224184
E-Mail: customers. gayathriestates@gmail.com
Website: www.gayathriestates.com

Vizag, Duvvada @ SunRise City near Phakirtekiya Village 3BHK, 1490 Sft Car Parking & Lift for Sale. ✆ 9849360605.

Flat for sale 3 BHK East Facing 2 Months to handover P.M.Palem 1st Bus Stop, Madhurawada ✆ 7981135813, 7993729143.

HOUSE FOR SALE

GAJUWAKA

ఇండిపెండెంట్ హౌస్ 300 గ॥లలో గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ Each 3 పోర్షన్స్ మార్బుల్ ఫ్లోరింగ్ నెలకు 40 వేలు అద్దె వస్తున్న @ ట్రెండ్స్ వెనుక కైలాసనగర్. GWK. 9491803404.

PENDURTHI

VUDA 3BHK Duplex Houses for Sale. 2400 SFt. with Car Parking at Sujathanagar, Teachers Layout. Contact: 9848215235, 0891-2558326.

GENERAL

VZM టౌన్ RTC కాంప్లెక్స్ దగ్గర, తోటపాలెం సాయినగర్ నందు 302 గజాలు ఇండివిడ్యువల్ ఇల్లు D.No.830-13/1 with full water అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలదు. ✆ 9494014654, 9494905236.

LAND FOR SALE

NARSIPATNAM

108 Acers Land, for Sale in Narsipatnam with 60,000 Teak Trees (25 years), only serious buyers. Cont: 8099999007.

PLOT FOR SALE

ANANDAPURAM

VMRDA Approved Plots @ Ananadapuram Highway Facing, Palavalasa Toll Gate Sqyd. - 25,000/- Only. Call: 9640604642.

ANAKAPALLI

అనకాపల్లి జిల్లా & మండలం, రాజుపాలెం & కొత్తూరు గ్రామంలో సౌత్ ఈస్ట్ రోడ్డు గల 40x60 కొలతలతో 267 చ॥గ॥ల ప్లాట్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 7780547343.

ATCHYUTAPURAM

Vizag Financial Capital VMRDA 1275 Scyds. Commercial Plot at 250 ft Master Plan Road Atchutapuram for Sale. ✆ 8639765271

BHEEMILI

SITE FOR SALE
West Facing 500/750 Sq.yards Site at BHIMILI TOWN, Beach Road Opp. REBOOT HOTEL with CRZ Permission. No Brokers.
9908945799 9989458986

BHOGAPURAM

Direct NH-16: Highway Facing 200 E/F, 267 Sq.Yds Premium Corner Plots @Bhogapuram & Pydibimavaram Jn., 90% Bank Loan Facility. ✆ 8309646918.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ సమీపంలో అతి తక్కువ ధరలో 100 గజాలు రూ. 1,50,000/-లకే లభించును. దగ్గరలో రిసార్ట్స్ సదుపాయం కలదు. Ph: 8978446704.

Farm Land available from NH-5 to Site 1.5 KM with Swimming Pool and Club House. Very reasonable Price. Contact: 8008597604.

భోగాపురం- టోల్‌గేట్‌ముందు E/F 244 చ॥గ॥ వుడా L.P. లేఅవుట్‌లో హైవేకి 2 వ బిట్ అమ్మకం. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 7799765558, 7799765559.

డైరెక్ట్ NH-16 ఫేసింగ్ అప్రూవ్డ్ ప్లాట్లు, భోగాపురం దగ్గరలో 200 గజాలు 90% బ్యాంక్ లోన్, వెంటనే ఇల్లు కట్టుకొనుటకు లభించును. గజం రూ॥ 13,999/- మాత్రమే. (నెలలోపు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి 1 లక్ష నగదు ఇవ్వబడును. ఫోన్: 9347353716.

GAJUWAKA

PLOT FOR SALE
311 Sq yards, Plot No MIG-65, VUDA Layout, Pedagantyada Village, Gandhinagar Phase-II, GAJUWAKA for sale
9052597156 9985188015

KAPULUPPADA

తోయపాలెం ఫుడ్ కార్పొరేషన్ భవనాలు దగ్గరలో ప్రకృతి శోభా లేఅవుట్ ఇల్లు కట్టుకోవడానికి అనువైన ప్రదేశం వుడా అప్రూవల్ 200 సౌత్ వెస్టు కార్నర్ ✆ 9059844450.

TAGARAPUVALASA

Avinash Properties Dussehra Bonanza - 5 gms gold free on every Plot Booking, Newly Launched with Fully Developed Ventures in Dakamari & Jonnada with VUDA approval and RERA approval. Starts from 167 Sq.Yds. 90% Bank Loan available. 9866844433.

GENERAL

6000 Sq.Y. Beach Facing Close to Vizag, Film Nagar Club, 2500 Sq.Y. Nr. INS Kalinga is For Sale. ✆ 9849100212, 9494951415.

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరురోడ్డు, బెంజసర్కిల్‌కి 5 కి.మీ, సున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- సంప్ర: ✆ 93985 76997.

విశాఖపట్నం సబ్బవరం Jn., కి అనుకొని Open ప్లాట్స్ ఇల్లు కట్టుకోవడానికి అనువుగా ఉండే స్థలాలు కేవలం 13,999/- లకే. ✆ 9948220644.

ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందబోతున్న విశాఖపట్నం పరిధిలో భీమిలి/ భోగాపురం/ తగరపువలస/ పూసపాటిరేగ హైవేలకు 1KM లో VMRDA & RERA అప్రూవ్డ్ Plots & Farm Lands బ్యాంక్ లోన్ సదుపాయముతో కలవు. 100 గజాల స్థలం రూ॥ 6.5 లక్షలు మాత్రమే. దీపావళి ఆఫర్ కలదు. ✆ శివకుమార్ 7671061056.

దీపావళి ఆఫర్: ఫ్రీ రిజిస్ట్రేషన్ 5 లక్షలకే 100 చ॥గ॥ విశాఖ వార్డు పరిధిలో 75 బిట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. 7093632399, 8019624319.

ఫ్లాష్.. ఫ్లాష్.. దీపావళి ఆఫర్ డైరెక్ట్ కంపెనీ సేల్ అగనంపూడి కేన్సర్ హాస్పటల్ దగ్గర VMRDA ఓపెన్ ప్లాట్స్ అతి తక్కువ రేట్లు సంప్రదించండి. 9676385022.

COMMERCIAL SPACE FOR SALE

విజయనగరం టౌన్ డాక్టర్స్ వీధి (జిడ్డు వారి వీధి) మెయిన్‌రోడ్ ఆనుకొని కమర్షియల్ సైట్ 116 గజాలు (14.5 x 72 ft) స్థలం అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ సంప్ర॥ ✆ 9908335577.

LEASE/ RENT

Rent/Lease @ MVP Colony, Sec-11, VSP. 6300 Sft & 16,500 Sft Suitable for Colleges, MNC Etc. Ph: 9849120130, 9848065402

WANTED

Wanted 30 Acres of Land (with clear Title) for Layout/ Residential purpose in between Anandapuram to Bhogapuram 1 to 2 KMs Radius from NH-16. Contact: 7997996785.

LEASE/ SALE

JAGADAMBA

Nr. Jagadamba Jn., 1200 Sqyds Site to Lease after Building to suit your needs or for Sale. suitable for any Commercial & Residential WhatsApp: +91 8977644475.

TO LET

BEACH ROAD

3 BHK E/F 2750 Sft Flat Air Conditioned with open Modular Kitchen & 2 Car Covered. Parking at Kirlampudi Layout, Nr. Beach Road. 9848522169.

RAMATALKIES

Tolet: 3B/R 1400 Sft. West Facing 2nd Floor, Near Timpany School, CBM Compound, Vizag. Ph: 7989209567.

SEETHAMMADHARA

To-Let in Seethammadhara North Extension, Opp. Hill View Park North Gate, D.No.: 50-116-5/2, Complete 1st Floor, 3BHK with Separate Drawing & Puja Rooms, East Facing. Con.: 9441518005.

SHEELANAGAR

3BHK Flat F303 in SL Surya Plaza, 8th Lane, Sri Venkateswara Colony, Sheelanagar. Lift & Car Parking. ✆ 9494666990.

GENERAL

3 BHK Flat 1675 sq.ft For Rent at Madhuranagar. Rent @ 30,000/- PM. Contact: 8452047891 for Details

3BHK, 1350' Flat for rent with lift and parking at Riddhi Enclave in Pithapuram colony vizag. Ph: 7032482682

SECOND SALE

మిధున్ ఏజెన్సీ: పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఆన్‌లైన్ UPSలు, మోటార్లు, వాషింగ్‌మిషన్స్, సిక్ ఇండస్ట్రీస్ కొనబడును. సంప్ర॥ 6309745364.

JOBS

Wanted *Field Sales Executives M/F. *Field Team Leaders M/F. Qualification Not Required. Interviews on: 25th to 28th Oct. GSM Home Made Pickles. 6304441208, 8500133456.

Wanted - Designers / DTP Operators -2Nos * Photoshop / AI /Corel / ID. Vizag, Ramatalkies Road. Ph: 9933540011.

Hiring * Accountant * Jr. Engineer * Admin & HR Asst. * Industrial Sales Exec. Experience: 6 to 3 Yrs. Contact: 9014633436.

కనీసం 2 సం॥ల అనుభవం ఉన్న టెక్నీషియన్స్ & అడ్వైజర్స్ కావలెను
Sita Prime Honda హోండా 2 వీలర్ షోరూం
మధురవాడ, విశాఖపట్నం-41
8977999082 9666838334

Job Vacancies Only for Ladies ప్రముఖ కార్పొరేట్ సంస్థనందు నూతనంగా ప్రారంభించబోవు సెంట్రల్ ఆఫీసునందు పనిచేయుటకు దిగువ సిబ్బంది కావలెను. * Office Managers: 2 ఖాళీలు 35 సం॥ పైబడి. డిగ్రీతో 5 సం॥ ఉద్యోగ అనుభవం కలిగినవారు అర్హులు. ఆదాయం: 40,000 P.M. (అన్నీ కలిపి) * Relationship Managers: 6 ఖాళీలు, 30 సం॥ పైబడి ఏ ఉద్యోగ అనుభవంలేని గృహిణులకు సువర్ణావకాశం. సెలెక్ట్ కాబడినవారికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగంనకు తీసుకొంబడును. స్వయం ఉపాధి కలిగిన చిరువ్యాపారులు కూడా అర్హులే. ఆదాయం: 30,000/- P.M. ఇంటర్వ్యూ తేదీలు: 26th & 27th. పూర్తి బయోడేటాతో హాజరుకాగలరు. Con: శ్రీ గౌరి నేమాని. 9154574627, 9848197936.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు *రిసెప్షనిస్ట్ (Female) *అకౌంటెంట్ *సైట్ ఇంజినీర్ మరియు మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. Contact: 7997996780.

హాస్పిటల్‌లో పనిచేయుటకు GNM, B.Sc నర్సు అనుభవం గల స్టాఫ్, 20 వేలు జీతం & వార్డు బాయ్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ స్టాఫ్, కుక్‌లు జీతం: 15 వేలు. 12 గం. డ్యూటీ. ఫుడ్, అకామిడేషన్ ఫ్రీ. RK హాస్పిటల్, కార్ఖానా, సికింద్రాబాద్. ✆ 9676532323, 9959932323.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీనందు పనిచేయుటకు 5 సం॥ అనుభవంగల * మార్కెటింగ్ ఏజెన్సీస్, * మార్కెటింగ్ సీనియర్ హెడ్స్ కావలెను. ఫోన్ నెం. 7997996780.

అనుభవం గల సేల్స్ సిబ్బంది కావలెను. భాగ్యశ్రీరామ్ జ్యూయలర్స్ స్క్వేర్ వివన హోటల్ ప్రక్కన సిరిపురం సర్కిల్, వైజాగ్. Ct: 8885697945, 6309028739.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. ✆ 96405 28899, 96406 48899.

భారతదేశంలోని అగ్రగామి సంస్థలో పనిచేయుటకు విశాఖపట్నంలో సేల్స్ ఆఫీసర్స్ & మేనేజర్స్ కావలెను. Inter/ Degree తెలుగు, ఇంగ్లీష్ వచ్చి ఉండాలి. Below 35 Yrs. ✆ 9492945063/ 9010666166.

ప్రముఖ TVS షోరూమ్ అనకాపల్లి నందు పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. ఎకౌంట్స్-2 (20,000), సేల్స్ మేనేజర్స్ -2 (20,000), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-4 (15,000), టెలీకాలర్స్ -4 (12,000), ఇన్సెంటివ్ కూడా ఇవ్వబడును. ఆటోమొబైల్ రంగంలో ఉన్నవారికి ప్రాధాన్యత. Ph: 8341546429.

ప్రముఖ ప్రఖ్యాతిగాంచిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీనందు క్రొత్త బ్రాంచ్‌లో వర్క్ చేయుటకు (1) సీనియర్ మేనేజర్స్:- 10, (2) మేనేజర్స్ - 8, (3) ఎగ్జిక్యూటివ్స్ - 12 కావలెను. M/F, వయస్సు: 30+, గతంలో ఏదైనా సంస్థలో పనిచేసినవారు, రిటైర్డ్ ఉద్యోగులు మరియు ఫ్రెషర్స్ కూడా అర్హులే. Ph: 7095788667, 8121100599.

ఇంటి పనులు రెండు పూటలు చేసుకొని నిజాయితీగా పని చేసే ఆడ వంట పనిమనిషి కావలెను. సీతమ్మధార. 94922 33869.

Airtel DTH & XStream Fiberలో పర్కిచేయుటకు టెక్నీషియన్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ (F) కావలెను. ఆఫీస్: అక్కయ్యపాలెం. Ph:9000556111, 9849057276.

ఆడ వంటమనిషి, ఆడ హెల్పర్‌లు, డెలివరీ బాయ్స్ పార్ట్ లేదా ఫుల్ Time పనిచేయుటకు కావలెను. భోజనం + వసతి ఇవ్వబడును. ✆ 83748 16236.

రిటైర్డ్ ఉద్యోగులకు సువర్ణావకాశం. ప్రముఖ సంస్థలో మేనేజర్ కేడర్‌లో పనిచేయుటకు (M/F) కావలెను. అర్హులకు మంచి ప్యాకేజి కలదు. ఫుల్ / పార్ట్ టైమ్. ✆ 9441336199.

ప్రముఖ ఆఫీస్‌కి మార్కెటింగ్‌లో అనుభవం ఉన్న మార్కెటింగ్ మేనేజర్స్, సిస్టమ్ వర్క్ వచ్చిన రిసెప్షనిస్ట్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. పెందుర్తి. Ph: 7459850542.

★Wanted Fresh Graduates Male Below 25 Yrs, Fluent in English for Medical Representative Post. Package - 23,000/- per Month. ✆ 88850 20890, 98490 91550

బ్రాంచ్ Asst. మేనేజర్స్ (M), ఆఫీస్ స్టాఫ్ (కంప్యూటర్ Exp) (M), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M), విశాఖపట్నం, గాజువాక, నర్సీపట్నం, చోడవరం, అనకాపల్లి ఏరియాలలో పనిచేయుటకు కావలెను. రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, డాబాగార్డెన్స్(?), వైజాగ్. ✆ 7680880513, 9100902198.

FACULTY/ TEACHERS

Wanted Female Home Tutor for Tutoring Inter Maths & 8th Class (CBSE) Evening 5PM. Venkojipalem, H.B.Colony. ✆ 9347046459.

గాజువాకలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు లేడీ వార్డెన్స్ కావలెను. జీతం+ ఉచిత భోజన వసతి కలదు. Ph: 9848577745, 9666694545.

MEDICAL

Medical Lab Technician, Duty Time- 6 am to 12 pm, Salary: 12000 /-, Saturday & Sunday Holiday, MVP Colony. Phone: 7288814540

SECURITY GUARDS

వైజాగ్ పోర్టులో సెక్యూరిటీగార్డులు కావలెను. అర్హత: 10th, జీతం: 12 గం॥ 15 వేలు, 8 గం॥ 12 వేలు. రూమ్, PF, ESI, RSR జడ్జి కోర్టు - జగదాంబ రోడ్, 3వ ఫ్లోర్, వైజాగ్. వాట్సప్: 7306582829.

TOURS AND TRAVELS

కార్తీకమాసం జ్యోతిర్లింగాలు భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, ఔండా నాగనాథ్, పరళీ వైద్యనాథ్, షిరిడి, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ + 20 క్షేత్రములు 8 రోజులు మహారాష్ట్ర ఏసి బస్సు Nov 3 & 25 లక్ష్మీ టూర్స్. ✆ 98662 46466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **దేవర** రామచంద్ర: **పొట్టేల్** శ్రీ సత్య: **ఎంత పనిచేశావ్ చంటి** సత్యనారాయణ: స్క్రీన్-1: **విశ్వం**, స్క్రీన్-2: **వెనమ్ ద లాస్ట్ డాన్స్ (3డీ)** పర్తిసాయి, షిర్డిసాయి : **వేట్టయన్ ద హంటర్** వెంకటేశ్వర: **నరుడి బ్రతుకు నటన**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వెనమ్ ద లాస్ట్ డాన్స్** స్క్రీన్-2: **మార్టిన్**

ఓటు నమోదుకు దరఖాస్తుల అందజేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు నిమిత్తం నక్కపల్లిలో పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం దరఖాస్తులు అందజేశారు. దీనిలో భాగంగా పీఆర్‌టీయూ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ప్రగడ శివాజీ పలువురు ఉపాధ్యాయుల దరఖాస్తులను నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల విభాగం సీనియర్ సహాయకులు సింహాచలానికి అందించారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

సత్తా చాటి.. బహుమతులు సాధించి..

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో అంతర్జాల వినియోగం వల్ల లాభ, నష్టాలు, సామాజిక మాధ్యమం విద్యార్థులపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు ఇంటర్‌నెట్ వినియోగం వల్ల కలిగే లాభనష్టాలను సమగ్రంగా వివరించారు. గెలుపొందిన పదోతరగతి విద్యార్థిని సీహెచ్ హేమశ్రీకి ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థి తుషారాకు ద్వితీయ, పదో తరగతి విద్యార్థి యు.లక్ష్యకు తృతీయ బహుమతులను పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాస్ అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్.ఎస్.రాంకుమార్, నాగలక్ష్మి, లలితకుమారి, ఎస్‌వీ నరసింహం పాల్గొన్నారు.


గాంధీనగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు


బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


బహుమతులు సాధించిన విద్యార్థులతో కమలకుమారి

★ అంతర్జాలాన్ని జాగ్రత్తగా వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయని శ్రీ చైతన్య పాఠశాల హెచ్‌ఎం వీవీ కమలకుమారి అన్నారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా అంతర్జాల వినియోగం పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు. ఎనిమిది నుంచి పదోతరగతి విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో అంతర్జాలాన్ని సక్రమంగా వినియోగిస్తే కలిగే లాభాలు. దుర్వినియోగం చేస్తే కలిగే నష్టాలను వివరించారు. పోటీలో గెలుపొందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సీహెచ్ సాయి జాహ్నవికి ప్రథమ బహుమతి అందజేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థి నిరంజన్‌కు ద్వితీయ, పదోతరగతి విద్యార్థిని ఎన్.యజ్ఞశ్రీ సహస్రకు తృతీయ బహుమతులు లభించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బెన్నీ థామ్సన్, డీన్ ఎస్‌డీ మహేష్, ఏఓ కె.రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగినులకు బాసటగా..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లిలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటుకు చర్యలు ఆరంభించారు. జిల్లా కేంద్రం అయిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేసే మహిళలు అధికమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి అనకాపల్లి వస్తున్న ఉద్యోగినులు స్థానికంగా ఉండడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఉద్యోగాలు చేసుకుంటూ వసతి గృహాల్లో ఉండాలనుకునే వారికి అనకాపల్లిలో ప్రైవేటు వసతి గృహాలు కరవవుతున్నాయి. దీంతో కూర్మన్నపాలెం, గాజువాక, విశాఖపట్నం ప్రాంతాల్లోని హాస్టల్స్‌లో ఉంటూ చాలామంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు కలిసి అద్దెకు గదులు తీసుకోవడం, హోటల్స్‌లో భోజనాలు చేస్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

అనకాపల్లి జిల్లా అయిన నేపథ్యంలో ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. ఈ సమస్యను పరిష్కరించేలా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ను అనకాపల్లిలో నెలకొల్పి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం చొరవ చూపింది. ఇందులో భాగంగా అనకాపల్లిలో వసతిగృహాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. తొలుత 20 మందికి దీన్ని ఏర్పాటు చేసి తదుపరి పెంచాలని యోచిస్తున్నారు. హాస్టల్ ఏర్పాటు కోసం స్థలం కావాలని రెవెన్యూ అధికారులకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు లేఖ రాశారు. స్థలాన్ని అందిస్తే భవన నిర్మాణంతో పాటు ప్రభుత్వం నుంచి సూపర్‌వైజర్‌ను నియమించి వారి పర్యవేక్షణలో వసతి గృహాన్ని నెలకొల్పి ఉద్యోగినులకు సేవలు అందించేలా చర్యలు తీసుకోనున్నారు.


అనకాపల్లిలో మహిళా క్రీడాకారుల వసతి గృహం

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో..

అనకాపల్లిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మహిళా క్రీడాకారిణులు ఉండేందుకు వీలుగా ఎన్టీఆర్ క్రీడామైదానంలో వసతిగృహం నిర్మించారు. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలో జరిగే సమయంలో వివిధ ప్రాంతాల నుంచి ఎవరైనా మహిళా క్రీడాకారులు వస్తే వారికి వసతి అందించేందుకు భవనాన్ని నిర్మించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనానికి స్థలాన్ని కేటాయించే వరకు ఇక్కడ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు కోరుతున్నారు. అనకాపల్లిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటుచేస్తే ఉద్యోగినులకు ప్రయోజనం చేకూరుతుంది. వీలైనంత త్వరగా దీన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారం..

అనకాపల్లిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. స్థలం కోసం ఆర్డీవోకు తెలిపాం. స్థలాన్ని కేటాయిస్తే ప్రభుత్వ పర్యవేక్షణలో సూపర్‌వైజర్‌ను నియమిస్తాం. కుక్, వసతిగృహ పర్యవేక్షణ చేస్తాం. ఆహారానికి అయ్యే ఖర్చును వసతిగృహంలో ఉండే ఉద్యోగినులకు సరిసమానంగా పంచి వారి నుంచి తీసుకుంటాం. నాణ్యమైన ఆహారం, మహిళా భద్రత, వసతిని తక్కువ ఖర్చుతో మహిళా ఉద్యోగినులకు అందించాలనే ఉద్దేశంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ని అనకాపల్లిలో ఏర్పాటు చేస్తున్నాం.



– అనంత లక్ష్మి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా సాధికారత అధికారిణి, అనకాపల్లి

అవీ ఇవీ

పారిశుద్ధ్యంపై అప్రమత్తం

అచ్యుతాపురం: పారిశుద్ధ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. గ్రామాలవారీగా సమీక్ష నిర్వహించుకొని పారిశుద్ధ్యం, పైపులైను నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చేతిబోరుకు మరమ్మతులు

మునగపాక, న్యూస్‌టుడే: తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి దిమ్మల అప్పారావు తెలిపారు. సాంబమూర్తి కోవెల ప్రాంగణంలో మరమ్మతులకు గురైన చేతిబోరును శుక్రవారం సర్పంచి అప్పారావు బాగు చేయించారు. చేతిబోరు మరమ్మతులకు గురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే బాగు చేస్తామన్నారు.

పుస్తకాల పంపిణీ

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పెద బోదిగల్లం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయులంతా కలిసి రూ. 10 వేల విలువైన సామగ్రి కొనుగోలు చేయగా, వీటిని ప్రధానోపాధ్యాయ వోడిశెట్టి సత్యనారాయణ అందించారు. మార్చిలో జరిగే పది పరీక్షలు సంబంధించి విద్యార్థులు మరింత శ్రద్ధ చూపేందుకు ఇవి ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్.ఆచార్యులు, ఎస్. పల్లంరాజు, ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, రమేష్ బాబు, శ్రీదేవి, చిన్నారావు పాల్గొన్నారు.

లోపాలున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ప్రశస్త యాప్‌లో నిర్దేశించిన విద్యార్థుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారులు కె.నరేశ్, వేమగిరి నూకరాజు సూచించారు. నక్కపల్లి మండల వనరుల కేంద్రంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం వీరిద్దరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై పరిశీలించి, ఏదైనా లోపంతో బాధ పడుతున్నట్లు గుర్తిస్తే యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యాప్ డౌన్‌లోడ్, నమోదు తదితర అంశాలను గొడిచెర్ల ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయిని యాస్మిన్ వివరించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని సోముదేవుపల్లి గ్రామానికి శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

షరతులు లేకుండా గ్యాస్ ఇవ్వాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ విధానాన్ని తాము ఆహ్వానిస్తున్నామని, ఎలాంటి షరతులూ లేకుండా దీనిని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు కోరారు. నక్కపల్లిలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ముందుగా లబ్ధిదారులు నగదు చెల్లిస్తే, ఈ సొమ్ము ఖాతాల్లో జమవుతుందని వెల్లడించడం సరికాదన్నారు. గ్యాస్‌ను ఉచితంగా అందించి ఆ సొమ్మును ప్రభుత్వమే నేరుగా సదరు కంపెనీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎం.రాజేశ్, రమణ, నూకరాజు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్య సామరస్యంగా పరిష్కరిస్తాం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో మత్స్యకారుల వేటకు ఇబ్బందులు లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఇటీవల నావిక ప్రత్యామ్నాయ స్థావరానికి కేటాయించిన భూముల అభ్యంతరాల సర్వేను మత్స్యకారులు అడ్డుకున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆయన గ్రామాన్ని, నావిక ప్రత్యామ్నాయ స్థావరాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు. మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, నావిక ప్రత్యామ్నాయ స్థావరం పనులు నిలిచి పోకుండా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీనిపై త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ మోహన్, సీఐ రామకృష్ణ, ఎస్సై విభీషణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

సైబర్ నేరాలపై అవగాహన

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కుంచ్రం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ వలలో చిక్కుకుంటే గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ సదస్సులో ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరాలు అన్ని ప్రాంతాల్లోనూ పెరిగి పోతున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఏటీఎం కార్డు పిన్ నంబరు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక, రాంబిల్లి, కశింకోట, న్యూస్‌టుడే: నారాయుడుపాలెం గ్రామాన్ని ఆనుకొని ఉన్న రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని గ్రామస్థులు శుక్రవారం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. సర్వేనంబరు 100-7లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా, ఆస్థలంలో పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ, పాలసేకరణ కేంద్రం నిర్మించారన్నారు. మిగిలిన స్థలంలో సామాజిక అవసరాల భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి విన్నవించామని పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బి శ్రీనివాసరావు, ఎస్.సింహాచలం, కాకర అప్పారావు, లక్ష్మి, వైరాము, కర్రి శ్రీను తదితరులు తెలిపారు. ఆస్థలాన్ని ఆక్రమించుకొని పశువుల కొట్టాం ఏర్పాటు చేశారని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాటిపల్లిలో జరిగిన సదస్సులో సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ మనీషా త్రిపాఠి పర్యవేక్షించారు. సదస్సులో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు ఆడారి కృష్ణవేణి, కె.వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలి


వినతులు పరిశీలిస్తున్న సర్వే ఏడీ మనీషా త్రిపాఠి

ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: తిమ్మాపురం గ్రామసభలో 43 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్ బాబు తెలిపారు. కుంచం కర్రి సత్యనారాయణ, ఉప తహసీల్దార్ నీరజ, మండల సర్వేయర్ త్రిమూర్తి, వీఆర్వోలు నూకరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు. రీసర్వే ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని లింగాపురం రైతులు కోరారు. గ్రామసభలో అర్జీలు స్వీకరించిన కోటవురట్ల తహసీల్దార్ తిరుమలబాబు ప్రతి ఫిర్యాదును పరిశీలించి, పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. నక్కపల్లి మండలం నల్లమట్టిపాలెంలో నిర్వహించిన గ్రామసభలో ఏడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆర్.నరసింహమూర్తి వెల్లడించారు.

న్నారు. గొరపూడి రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి 38 అర్జీలు అందాయని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు చెప్పారు. కశింకోట మండలం ఎనపేటలో వివిధ సమస్యలపై తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు దరఖాస్తులు స్వీకరించారు. రక్షిత మంచినీటి పథకానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీటీ భాస్కరరావు, సర్వేయర్ రామారావు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా బాబులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి నాగేంద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఈడి బాబులను నియమించారు. జనసేన ఉత్తరాంధ్రా జిల్లాల రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా బాబులును శుక్రవారం పార్టీ కార్యాలయంలో సతీష్‌తో పాటు జనసేన నాయకులు కొరాడ సాంబ, పూలకోటా రమేష్, నైనార్ రమేష్, దాడి రమేష్, నక్కావెంకటరమణ, కొరాడ నరేష్ అభినందించారు.


బాబులును అభినందిస్తున్న సతీష్‌కుమార్ తదితరులు

భూముల విలువను పక్కాగా నమోదు చేయండి

మునగపాక, న్యూస్‌టుడే: భూములు, ఆస్తుల ప్రభుత్వ విలువ, ప్రస్తుత మార్కెట్ ధర వ్యత్యాసాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు సూచించారు. మునగపాక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూముల ధర నమోదుపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వాటి ఆధారంగా నమోదు చేయాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ మాధవి కుమారి, ఎంపీడీఓ ఉషారాణి, తహసీల్దార్ ఆది మహేశ్వరరావు, డీటీ పడాల్ పాల్గొన్నారు.

అభిజిత్ కంపెనీని తెరిపించాలని రాస్తారోకో



కార్మికులు, నాయకుల రాస్తారోకో

అచ్యుతాపురం, కశింకోట, న్యూస్‌టుడే: అభిజిత్ కంపెనీని తెరిపించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. కంపెనీ నుంచి ర్యాలీగా బయలుదేరిన కార్మికులు అచ్యుతాపురం కూడలిలో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ మూడు వేల మంది కార్మికులు రోడ్డున పడినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం నుంచి కోట్లాదిరూపాయలు రాయితీలు పొంది ఇప్పుడు మూసివేయడం అన్యాయమన్నారు. నాయకులు సోము నాయుడు, రుత్తల శంకరరావు తదితరులు పాల్గొన్నారు. జోగారావుపేటకు చెందిన కార్మికులు నిరసన తెలిపారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు నిరసన చేస్తున్నా పట్టించుకోవడం దుర్మార్గమని సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు విమర్శించారు. ప్రభుత్వం కల్పించుకొని తిరిగి కర్మాగారం తెరిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సన్యాసిరావు, శ్రీనివాసరావు, చంద్రరావు, పుష్పవతి, పాపమ్మ, భూలక్ష్మి, నాయకులు సోమునాయుడు, సత్తిబాబు, ఎం.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం రహదారికి మరమ్మతులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి పరుశురామ్‌పేట ఉమా రామలింగేశ్వరాలయం ముందు ఉన్న రహదారికి శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరమ్మతులు చేపట్టారు. కార్తీక మాసం దృష్ట్యా ఆలయానికి వచ్చే భక్తులు, వాహనాలు ఇబ్బంది పడకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన అర్చకులు సాంబ్రాజు రమణశర్మ తెలిపారు.


రహదారి పనులు చేస్తున్న సిబ్బంది

బాధ్యులపై పోక్సో కేసు పెట్టండి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమణ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎలమంచిలి మండలం లైన్ కొత్తూరు న్యూ లైఫ్ వసతి గృహంలో ఉంటున్న తొమ్మిదో తరగతి బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై పోక్సో కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీపీఎం భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికల వసతి గృహాల్లో పురుషులు ఉండకూడదన్నారు. బాలికను వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాలికల భద్రతకు అధికారులు భరోసా ఇవ్వాలని కోరారు. ప్రతి వసతి గృహానికి వార్డెన్ నియమించాలన్నారు. బాలికల వసతి గృహాల్లో మహిళా వార్డెన్లు, మహిళా సిబ్బందినే నియమించాలన్నారు. కమిటీ సభ్యులు కె.అర్జున్, ఎస్.ప్రసాద్, వి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కశింకోట: మోసయ్యపేట మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుద్దేటి శ్రీను ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రసాదాన్ని స్వీకరించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద

నేడు వేల్పులవీధిలో..

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆలయం నుంచి వరిదుబ్బు తీసుకువచ్చి పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు.

రాంబిల్లి, న్యూస్‌టుడే: హరిపురం పంచాయతీ వెంకటాపురం కూడలిలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ ఒసదర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. హరిపురం, వెంకటాపురం, ఇందిరమ్మకాలనీ భక్తులతోపాటు పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా కోలాటాలు, భజనలు, తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకురాలి చేతివాటం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రేవుపోలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన కోడిగుడ్లను మధ్యాహ్న భోజన నిర్వాహకులు కాజేస్తున్నట్లు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఎర్రయ్య గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థులకు భోజనాలు వడ్డించిన తరవాత మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు జామి లక్ష్మిని అడ్డుకుని ఆమె పట్టుకుని వెళ్తున్న క్యాన్ తెరిచి చూడగా అందులో సుమారు వంద కోడిగుడ్లు ఉన్నాయి. దీంతో లక్ష్మిని పాఠశాలకు తీసుకువచ్చి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఈఓ-2 సత్తిబాబును వివరణ కోరగా పాఠశాలలో కోడిగుడ్ల చోరీ వ్యవహారం తన దృష్టికి వచ్చిందన్నారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై ప్రధానోపాధ్యాయుడు బాధ్యతగా ఉండాలన్నారు. చోరీపై ప్రధానోపాధ్యాయుడిని వివరణ ఇవ్వాలని కోరామని, దీని ఆధారంగా డీఈఓకు నివేదిక పంపుతామని తెలిపారు.


లక్ష్మిని మందలిస్తున్న హెచ్‌ఎం

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

ఎలమంచిలి పట్టణం, న్యూస్‌టుడే

గత పాలకుల చేసిన తప్పిదంతో ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో ప్రభుత్వ భవనాలను పట్టించుకోని కారణంగా వీటి నిర్వహణ నీరుగారింది. తహసీల్దార్ కార్యాలయం వెనుకభాగం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ శాఖ, తాగునీటి సరఫరా విభాగం కార్యాలయం 40 ఏళ్ల కిందట నిర్మించినవే! ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవనం ముందు పోర్టుకో కూలిపోయింది. ఆ సమయంలో అక్కడా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పశువైద్యశాల దెబ్బతింది. లోపల భాగం పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. విధిలేక అక్కడే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ భవనం కూడా అంతే. వ్యవసాయశాఖకు సొంత భవనం లేకపోవడంతో ఎస్సీ హాస్టల్‌లో ఒక పక్కన నిర్వహిస్తున్నారు. మరో వైపు వార్డు సచివాలయం ఉంది. కూటమి ప్రభుత్వం శాశ్వత భవన సముదాయాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎలమంచిలిలో పశువుల ఆసుపత్రి భవనం

కుంగిన కల్వర్టులు.. ప్రయాణానికి కష్టాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ప్రయాణించినా ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా వీటిపై భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పాయకరావుపేట మండలం గుంటపల్లి ఎస్సీ కాలనీ వద్ద ఉన్న కల్వర్టు కుంగిపోయింది. గ్రామం నుంచి నక్కపల్లి మండలంలోని ఒడ్డిమెట్ట, జాతీయ రహదారి చేరేందుకు ఇదే దగ్గర దారి. చెరువును ఆనుకుని ఉన్న కల్వర్టు శిథిలం కావడంతో రెండు వైపులా దెబ్బతింది. గుంతలు పడ్డాయి. వర్షాలు కురిస్తే వీటిలో నీరు చేరుతోంది. వాహనచోదకులు గుంతలను గుర్తించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా అరట్లకోట లోని గ్రామ సచివాలయం నుంచి పాయకరావుపేటకు వెళ్లే దారిలో కల్వర్టు పరిస్థితి దారుణంగా మారింది. పూర్తిగా శిథిలమై కుప్పకూలింది. లోతైన గొయ్యి ఏర్పడింది. రాకపోకలు సాగించాలంటే పక్క నుంచి వెళ్లాల్సిందే. దీన్ని దాటుకుని పంట భూములకు నిత్యం రైతులు, కూలీలు వెళ్తుంటారు. అంతేగాక జాతీయ రహదారి పక్కన ఉన్న పోలీసుస్టేషన్ వరకు రోడ్డు ఉంది. అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టులకు కొత్తరూపు తీసుకురావాలని కోరుతున్నారు. ఈఓఆర్‌డీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా కల్వర్టులకు కొత్తరూపు తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.


గుంటపల్లిలో రహదారి మధ్యలో..


అరట్లకోట వద్ద ఇలా..

తెదేపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాడి రత్నాకర్ తెలిపారు. శనివారం లక్ష్మీనారాయణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. కశింకోటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పీలా గోవింద సత్యనారాయణ సమక్షంలో నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు మండల తెదేపా అధ్యక్షులు కాయల మురళీధర్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74721
ఎలమంచిలి - 80085 74979
పాయకరావుపేట - 80085 74750

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే


?: అనకాపల్లి చవితిన వీధిలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. రాత్రివేళలో వాహనదారుల వెంట పడుతున్నాయి.

– ప్రశాంత్‌కుమార్, అనకాపల్లి

✓: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. –రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

రాత్రిపూట చదివేద్దాం.. డిప్లొమో కోర్సు చేసేద్దాం..

ఏ గలంతా పరిశ్రమల్లో, సంస్థల్లో కష్టపడే వారికి రాత్రి వేళ చదువుకుని డిప్లొమో చేసే అవకాశాన్ని రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కల్పించింది. ఇది కేవలం వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం మాత్రమే. దీనిపై అనేక మందికి సందేహాలు ఉన్నాయి. ఏఏ కోర్సులు చేస్తే డిప్లొమా ఏ బ్రాంచిలో చేరవచ్చో చాలా మందికి అవగాహన లేదు. కోర్సు కాలపరిమితి, సమయాలు, బోధనా విధానం... ఇలాంటి సవాలక్ష సందేహాలు ముసురుకున్న వేళ వాటిని నివృత్తి చేసేందుకు 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. దీనికి పలువురు ఔత్సాహికులు ఫోన్లు చేసి తాము చదివిన కోర్సు, డిప్లొమోలో చేరడానికి గల అవకాశాల గురించి వివరాలడిగారు. వీరందరికీ ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ చక్కగా సమాధానాలు ఇచ్చారు. – కంచరపాలెం, న్యూస్‌టుడే



డాక్టర్ కె.వి.రమణ, ప్రిన్సిపల్, ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్

ప్రశ్న: ఆర్అండ్‌బి సర్కిల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నాను. డిప్లొమో చేయవచ్చా? –ఎస్.శ్రీనివాసరావు, సీతమ్మధార

జవాబు: లేదు. పరిశ్రమల్లో ఏడాది అనుభవంతో పనిచేస్తూ ఉండాలి. క్లరికల్ విభాగానికి అర్హత లేదు.

?: ఐటీఐ కార్పెంటరు ట్రేడ్ పాస్ అయ్యాను. రాత్రి కాలేజీలో చేరవచ్చా?
–లావణ్యకుమార్, నేవల్ డాక్‌యార్డ్

✓: ఐటీఐ రెండేళ్ల కోర్సు చేసిన వారు అర్హులు. కార్పెంటరు ఏడాది కోర్సే. ఇంటరు ఎంపీసీ ఉన్నా పరిశ్రమల్లో ఏ విభాగంలో అనుభవం ఉందో దానికి సంబంధించిన డిప్లొమో కోర్సు చేయవచ్చు.

?: ఐటీఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ చేశాను. డిప్లొమోకు అర్హత ఉందా? ఏ కళాశాలలో ఉంది? ఫీజు ఎంత కట్టాలి? –బి.సురేష్‌కుమార్, వెంకట్, జగదీష్

✓: బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచి ఉంది. అక్కడకు వెళ్లి దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ ఫీజు సెమిస్టరుకు రూ.18వేలు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. రెండేళ్ల కోర్సు.

?: ఇంటర్ సీఈసీ చదివి డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్నాను. –కె.వి.దుర్గాప్రసాద్, డాక్‌యార్డ్

✓: ఇంటర్ ఆర్ట్స్ గ్రూపువారికి అవకాశం లేదు. ఎంపీసీ, బైపీసీ, కంప్యూటర్స్, ఐటీ తదితర కోర్సులు చేసిన వారు అర్హులు.

?: మెరైన్ ఇంజినీరింగ్ వర్క్‌షాపులో కార్పెంటరుగా చేస్తున్నాను.. –శ్రీనివాసరావు

✓: ఐటీఐ రెండేళ్ల కోర్సు ఉండాలి. కార్పెంటరు ఏడాది కోర్సు కాబట్టి అర్హత లేదు.

?: డిప్లొమో ఎలక్ట్రికల్ బ్రాంచ్ ఏ కళాశాలలో ఉంది? ఐటీఐలో ఎలక్ట్రికల్ ట్రేడ్ చదివాను. –దుర్గభానుతేజ, నర్సీపట్నం

✓: బెహరా ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచి ఉంది. రాత్రి కళాశాలలో చేరాలంటే మీరు పనిచేస్తున్న కంపెనీకి, చేరే కళాశాలకు యాభై కిలోమీటర్ల మేర దూరం ఉండాలి. నర్సీపట్నమంటే ఎక్కువ దూరం కావచ్చు. సరిచూసుకోండి.

?: ఐటీఐలో వెల్డర్ ట్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించాను. అవకాశం ఉందా?
–ఎస్.వెంకటనూక అప్పారావు

✓: వెల్డరు ట్రేడు ఒక ఏడాది కాబట్టి అవకాశం లేదు.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చేశాను. స్టీల్‌ప్లాంటులో జనరల్ ఫోర్‌మెన్‌గా చేస్తున్నాను. నాలుగేళ్లలో రిటైర్ అవుతున్నాను. డిప్లొమో చేయవచ్చా?
–ఎల్.వి.ఎం.మురళీబాబు, స్టీల్‌ప్లాంటు

✓: మెకానికల్ బ్రాంచ్ చేసేందుకు మీకు అర్హత ఉంది. ఇది బెహరా కళాశాలలో ఉంది. కంప్యూటర్స్ కూడా చేయవచ్చు. ఇది రాజమండ్రిలో ఉంది. శనివారం సాయంత్రం అయిదు గంటల్లోగా ఎక్కడ చేరాలనుకుంటున్నారో అక్కడ దరఖాస్తు చేయాలి.

?: ఐటీఐ మెషినిస్టు ట్రేడ్ చేశాను. డిప్లొమో చేయవచ్చా? –ఎ.శేఖర్

✓: మెకానికల్ చేసేందుకు అర్హత ఉంది. బెహర, ప్రశాంతి కళాశాల్లో అందుబాటులో ఉంది.

?: హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నాను, డిప్లొమో ఇక్కడ చేయవచ్చా?
–సాయిచరణ్, హైదరాబాద్

✓: ఇక్కడ చేయడానికి అవకాశం లేదు.

?: ఇంటర్ ఎంపీసీ చదివాను. ప్రయివేటు కంపెనీ జీఆర్ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్నాను. – సతీష్

✓: సివిల్ డిప్లొమో చేసేందుకు అర్హులు. ప్రశాంతి ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల అచ్యుతాపురంలో అవకాశం ఉంది.

?: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చేశాను. సివిల్ చేయాలనుకుంటున్నాను?
– సాయిశశాంక్, ఏయూ

✓: వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు మాత్రమే రాత్రి కళాశాల. మీరు వర్కింగ్ ప్రొఫెషనల్ కాకపోవడంతో డిప్లొమో చేసేందుకు అర్హత లేదు.

?: ఐటీఐ చదివి ఎ.పి.ట్రాన్స్‌కోలో చేస్తున్నాను. ఎక్కడ చేరాలి? –బి.రవి

✓: నరవలోని బెహరా కళాశాలలో ఉంది. అక్కడ దరఖాస్తు చేయండి.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చేయడంతో ప్రస్తుతం డాక్‌యార్డ్ కెమికల్ విభాగంలో పని చేస్తున్నాను. కెమికల్ ఇంజినీర్ అవ్వాలని ఉంది. దరఖాస్తు చేయవచ్చా? – ఎం.సరోజ్

✓: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో చేరవచ్చు.

?: ఇంటర్ ఒకేషనల్ వాటర్ సప్లై మేనేజ్‌మెంటు కోర్సు చదివి రుషికొండలో ఐటీ పార్కులో చేస్తున్నాను.
– సత్తిబాబు, రుషికొండ

✓: మీకు కంప్యూటర్స్, సివిల్ కోర్సులు చేసేందుకు అర్హత ఉంది. సివిల్ ప్రశాంతి కళాశాలలో, కంప్యూటర్స్ రాజమండ్రిలో ఉన్నాయి.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చదివి డాక్‌యార్డ్‌లో చేస్తున్నాను. –జి.శ్రీరాములు

✓: కెమికల్ బ్రాంచ్‌లో డిప్లొమో చేసేందుకు అర్హులు.

?: రాత్రి కళాశాల ఏ సమయంలో ఉంటుంది? – ఈశ్వరప్రసాద్, భీమిలి

✓: పగటి పూట పనిచేసిన వారికి రాత్రి వేళ డిప్లొమో కోర్సు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 9:00 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయి.

ఘనంగా విశాఖ పోర్టు ఆవిర్భావ వేడుకలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) 91వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం పోర్టు ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ అంగముత్తు ముఖ్య అతిథిగా పాల్గొని పోర్టు పరిపాలన భవంలో నవీకరించిన బోర్డు రూమ్‌ను ప్రారంభించారు. ఉప ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సుందరీకరణ, పచ్చదనం పెంపొందించే పలు ప్రాజెక్టులను శంకుస్థాపన చేశారు. పోర్టు ఛైర్మన్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ టన్నుల సరకు రవాణా చేశామని, ఈ ఏడాది 90 మిలియన్ టన్నులను లక్ష్యంగా పెట్టుకున్నామని, దీని సాధనకు ఉద్యోగులు, వ్యాపారులు సహకరించాలన్నారు. అనంతరం వివిధ సంస్థలకు సీఎస్ఆర్ చెక్కులను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు, స్టీవ్‌డార్లు, పీపీపీ, బీఓటీ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.



నవీకరించిన బోర్డు రూమ్‌ను ప్రారంభిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ పేలుడుపై ఎన్‌జీటీ విచారణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ పేలుడుపై న్యూదిల్లీలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో విచారణ ప్రారంభమైంది. ఆగస్టు 22న ఈ పరిశ్రమలో రియాక్టర్ పేలి 17 మంది మృతిచెందగా, 20 మంది గాయపడ్డారని పత్రికల్లో కథనాలు రావడంతో దీనికి సుమోటోగా కేసు నమోదు చేసిన ఎన్‌జీటీ.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కంపెనీకి చెందిన మొదటి ప్రతివాది తరఫున ఆర్.తిరునయువరాసు, 2, 4వ ప్రతివాదుల తరఫున మాధురి దొంతిరెడ్డి నోటీసులను స్వీకరించి విచారణకు హాజరయ్యారు. ఈనెల 22న మొదటి దశ విచారణ చేసిన ఎన్‌జీటీ జస్టిస్ పుష్ప సత్యనారాయణ పూర్తి వివరాలు సమర్పించాలని ఈ కేసును వచ్చే ఏడాది జనవరి 7కు వాయిదా వేశారు.

మెగాస్టార్ ఫ్యాన్ సినీ పోస్టర్ విడుదల

అనకాపల్లి, న్యూస్‌టుడే: మెగాస్టార్ ఫ్యాన్ సినిమా పోస్టర్‌ను శుక్రవారం అనకాపల్లిలో విడుదల చేశారు. అల్లు శ్రీరాములునాయుడు నిర్మాణ సారథ్యంలో కిరణ్ వారియర్ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. రాజ్, సోనా రెడ్డి హీరో, హీరోయిన్లుగా నటించారు. చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ అభిమాన సంఘ నాయకులు శ్రీరామదాసు గోవింద, గల్లా కొండలరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, మళ్ల శ్రీను, బొడ్డేడ మురళి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సినిమాను విజయవంతం చేయాలని కోరారు.

పర్యాటకులు మెచ్చేలా... ఆదాయం వచ్చేలా!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి

ఈనాడు, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విశాఖ కీర్తిని విశ్వవ్యాప్తంగా చేసేలా ఇక్కడి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పర్యాటకులను ఆకట్టుకుని, ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర పరిసరాల్లో ఆధ్యాత్మిక, తీర (బీచ్), క్రూయిజ్, పర్యావరణ, బౌద్ధ, చిత్ర, వైద్య పర్యాటకాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు శుక్రవారం నగరంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విశాఖ జోన్ సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.



హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు, మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

రూ.29 కోట్లతో బొర్రా గుహల అభివృద్ధి: బొర్రా గుహలు, లంబసింగి తదితర ప్రాంతాలను స్వదేశీ దర్శన్-2 కింద అభివృద్ధి చేయనున్నారు. రోడ్డు నుంచి గుహల ప్రవేశ ద్వారం వరకు షాపింగ్ స్ట్రీట్‌లా తీర్చిదిద్దడంతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బొర్రా గుహల అభివృద్ధికి రూ.29 కోట్లు మంజూరయ్యాయి. వాటితో దశల వారీగా అభివృద్ధి పనులు చేయనున్నారు. అరకు, అనంతగిరిలోని పర్యాటక అతిథి గృహాలను ప్రైవేటుకు దీటుగా ఆధునికీకరణ చేపట్టనున్నారు. నగరంలో యాత్రి నివాస్ సహా రాష్ట్రంలో 18 రిసార్ట్‌ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నారు. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలనుకుంటున్నారు.

పర్యాటకంపై శ్వేతపత్రం: రామకృష్ణ బీచ్ నుంచి భీమిలికి బస్సు సదుపాయం, శనివారం సాయంత్రాల్లో బీచ్‌లో డ్రోన్ షో ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని సీఐఐ విజ్ఞప్తి చేసింది. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా జేఎల్ఎల్ సంస్థ తయారుచేసిన విశాఖలో పర్యాటక రంగంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.

అనుమతులకు ఏకగవాక్ష విధానం: విశాఖలో సినిమా చిత్రీకరణలకు అనుమతులు ఇచ్చేందుకు ఏకగవాక్ష విధానం ఏర్పాటుచేయాలని సినీ పరిశ్రమ ప్రతినిధులు కోరుతున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం పర్యాటక పాలసీని తయారు చేయనుంది. తెన్నేటి పార్కుకు సమీపంలో ఉన్న 'ఎంవీ మా' నౌకతోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధికి అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అలాంటి ప్రాజెక్టుల వివరాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించనున్నారు.

క్రూయిజ్ హబ్‌గా: దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భాగంగా 'నీతిఆయోగ్ గ్రోత్‌హబ్' జాబితాలో దక్షిణ భారతదేశంలో విశాఖకు చోటుదక్కింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పర్యాటకపరంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోనున్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీలంక, చెన్నై, పుదుచ్చేరి ప్రాంతాలకు లగ్జరీ క్రూయిజ్‌లు ఏర్పాటుచేసి, క్రూయిజ్ టూరిజం అభివృద్ధి చేయనున్నారు.

సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి: నగరంలో వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపరుస్తాం. త్వరలో హాస్పిటాలిటీ శిక్షణ సంస్థలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటాం. హోటళ్లలో పని సమయానికి రాత్రి 12 గంటల పొడిగించడంతో పాటు నగరాన్ని పర్యాటకులకు అనుకూలంగా తీర్చిదిద్దడానికి వీధిదీపాలు, రవాణా సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాం' అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

పలు రైళ్ల రద్దు.. కొన్ని రీ షెడ్యూల్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దానా తుపాను ప్రభావంతో పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 26న హావ్‌డా-ఎస్ఎంవీటీ బెంగళూరు (12245) దురంతో, షాలిమార్-హైదరాబాద్ (18045), హావ్‌డా-తిరుపతి (20889) హంసఫర్, షాలిమార్-తిరునల్వేలి(06088) రైళ్లను రద్దు చేశారు.

★ సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్(20807) ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25న సాయంత్రం 6 గంటలకు బదులు 2.20 గంటలు ఆలస్యంగా రాత్రి 8.20 గంటలకు.., హావ్‌డా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ 25న రాత్రి 11.55 గంటలకు బదులు 3గంటలు ఆలస్యంగా 26వ తేదీ తెల్లవారుజామున 2.55 గంటలకు బయలుదేరేలా (రీషెడ్యూల్) మార్పు చేశారు.

కోయంబత్తూరు-బరౌని మధ్య ప్రత్యేక రైలు

కోయంబత్తూరు-బరౌని-కోయంబత్తూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కోయంబత్తూరు-బరౌని (06055) ప్రత్యేక రైలు ఈనెల 26 నుంచి నవంబరు 16 వరకు ప్రతి శనివారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ వచ్చి..10.50 గంటలకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కోయంబత్తూరు(06056) ప్రత్యేక రైలు ఈనెల 29 నుంచి నవంబరు 19 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి రెండో రోజు తెల్లవారుజామున 3.48 గంటలకు దువ్వాడ వచ్చి 3.50 గంటలకు వెళుతుంది.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు వెలమ కుల వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి వెలమ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం పెందుర్తి వెలమతోట (అనకాపల్లి రోడ్డు)లోని శ్రీవెలమ రైతు సేవా సంఘం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు *(శనివారం, అక్టోబరు 26న)*, రేపు *(ఆదివారం, అక్టోబరు 27న)* ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా, యాప్ ద్వారానూ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు.
– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ఏఈఈపై శాఖాపరమైన విచారణకు ఆదేశం

చోడవరం, న్యూస్‌టుడే: జల వనరుల శాఖ వడ్డాది విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) ఆకుల ప్రకాష్‌పై శాఖపరమైన విచారణ జరపాలని జలవనరుల శాఖ విజిలెన్స్ విభాగం ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక చీఫ్ కార్యదర్శి జి.సాయిప్రసాదు పేరిట ఆదేశాలు జారీ అయ్యాయి. అయిదేళ్ల క్రితం వడ్డాది సెక్షన్ కార్యాలయంలో ప్రకాష్ ఏఈఈగా పనిచేస్తుండగా.. నీరు-మీరు పనులపై ఓ రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దాడిచేశారు. అప్పట్లో ఆయన్ను సస్పెండ్ చేశారు. అప్పట్లో వచ్చిన వివిధ ఆరోపణలపై ఇప్పుడు శాఖాపరమైన విచారణ చేయాలని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణ అధికారి ముందు ప్రకాష్ హాజరవ్వాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

నూతన సాంకేతికతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: నూతన సాంకేతికతతో సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌డివిజన్ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నూతన సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందరూ వ్యవసాయంలో నూతన విధానాలపై అడుగులు వేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.శ్రీధర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల బీమాలో భాగం కావాలన్నారు. కీటక శాస్త్రవేత్త సరిత మాట్లాడుతూ వరిపొలంలో తెగుళ్లు పురుగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. పొడతెగులు, ఆకు ముడత నివారణకు హెక్సా కొనజోల్ మందును రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. సబ్‌డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రంజీ మ్యాచ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆంధ్ర-హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా రెండు జట్ల క్రికెటర్లు శుక్రవారం స్టేడియం 'బి' మైదానంలోని నెట్స్ వద్ద సాధన చేశారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో శ్రమించారు. అంతకు ముందు స్టేడియం వ్యాయామశాలలో కసరత్తులు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల గంటల వరకు మ్యాచ్ జరుగుతుంది. ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించారు.

విశాఖ ఖ్యాతిని పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నగర ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దాదాపు 4గంటల సేపు ఈ సమీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, ప్రజాప్రతినిధులు

భోగాపురం విమానాశ్రయానికి 45నిమిషాల్లో చేరుకోవాలి

సమీక్ష సమావేశంలో, తదుపరి మీడియాతో ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి 45 నిమిషాల్లో చేరుకొనేలా రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. లంకెలపాలెం నుంచి భోగాపురం వరకు 12 కూడళ్లు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఆయా చోట్ల ఫ్లైవంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి 16ని విస్తరించడం, లేదా బీచ్ రోడ్డును భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేయడంపై సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రజాప్రతినిధులు తిలకించారు. నగర బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)కు సంబంధించి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సీపీ శంఖబ్రత బాగ్చీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

విభిన్న ప్రతిభావంతులకు క్రీడా మైదానం

నగరంలో కాలుష్య నివారణ చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. పంచగ్రామాల భూసమస్యను కొలిక్కి తేవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జీవీఎంసీ పరిధిలో 100శాతం యూజీడీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీని కోసం రూ.200కోట్లు కేటాయించామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఫీజుల విషయంలో విద్యార్థులను విద్యా సంస్థల నిర్వాహకులు ఇబ్బంది పెట్టరాదన్నారు. ధ్రువపత్రాలు వారి వద్ద ఉంచుకోవడం చట్ట విరుద్ధమన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రస్తావించిన అంశాలు ఇలా..

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కన్వేయన్స్ డీడ్‌లు, 22ఏ భూముల విషయంలో సడలింపు ఇవ్వాలన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు జెట్టీ నిర్మాణం చేపట్టాలన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సదరం స్లాట్ల బుకింగ్‌లో ఇబ్బందులను తొలగించాలన్నారు. నగరంలో హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. ప్రజాప్రతినిధుల వినతులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు కోరారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పగటిపూట చేపట్టరాదని, జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సూచించారు.

★ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, డీసీపీ అజిత, డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, భీమిలి ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధులు, తల్లిదండ్రులు, పోషణ, సంక్షేమ చట్టం కరపత్రాలను విడుదల చేశారు.

ఫాం-19 దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి తాజా ఓటర్ల జాబితాలో అర్హులంతా ఫాం-19 దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో దయానిధి పేర్కొన్నారు. నవంబరు 6లోగా సంబంధిత ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. ఫాం-19 దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరూ అర్హత తేదీ నాటికి ఆరేళ్ల ముందు. కనీసం మూడేళ్లపాటు నిర్దిష్ట విద్యాసంస్థలో పనిచేసినట్లు ధ్రువప్రతం జతచేయాలన్నారు.

బాలలతో పనిచేయిస్తే చర్యలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: దుకాణాల్లో బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు తప్పవని కార్మిక శాఖ ఎలమంచిలి సహాయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. నక్కపల్లిలో పలు దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం బాలలు బడిలోనే ఉండాలని, ఇలాంటి వారిని కార్మికులుగా ప్రోత్సహించడం నేరమన్నారు. బాలల సంరక్షణ ప్రతినిధులు లోవరాజు, అమ్మాజీ పాల్గొన్నారు.



నక్కపల్లిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారి

'విశాఖ డెయిరీ'పై భీమిలి ఆర్డీవో విచారణ

గ్రామీణభీమిలి (విశాఖపట్నం), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం అత్యంత ఖరీదైన భూములను ఆక్రమించారనే ఆరోపణపై భీమునిపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో సంగీత్ మాథుర్ విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఆ సంస్థ జనరల్ మేనేజరు విద్యారావు యాజమాన్యం తరఫున హాజరయ్యారు. విశాఖ గ్రామీణ మండల పరిధిలో దాదాపు 7.02 ఎకరాల ప్రభుత్వ భూమిని విశాఖ డెయిరీ ఆక్రమించినట్లు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇటీవల విశాఖ జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక విచారణ చేపట్టిన రెవెన్యూ యంత్రాంగం డెయిరీ యాజమాన్యానికి, పశు సంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులకు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లకు నోటీసులు పంపి శుక్రవారం ఉదయం విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. డెయిరీ యాజమాన్య ప్రతినిధులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను సమర్పించగా, పశు సంవర్ధకశాఖ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) అధికారులు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. దీనిపై తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దీనిపై క్షేత్రస్థాయిలో లోతుగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అనంతరం చట్టప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.



విచారణకు హాజరైన విశాఖ డెయిరీ యాజమాన్య ప్రతినిధి

'కోడికత్తి' కేసుకు ఆరేళ్లు

అప్పట్లో వైకాపా ఎన్నికల ప్రచారాంశంగా ఈ ఘటన

ఇన్నాళ్లుగా న్యాయస్థానంలో విచారణకు హాజరవ్వని జగన్

ఈనాడు–విశాఖపట్నం: రాష్ట్రంలో సంచలనం రేపిన 'కోడికత్తి' ఘటన విశాఖ విమానాశ్రమంలో జరిగి ఆరేళ్లవుతోంది. ఓ పెద్ద హైడ్రామాగా మారిన ఈ కేసును వైకాపా 2019 ఎన్నికల్లో ప్రచారాంశంగా మార్చుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న జనపల్లి శ్రీను విచారణ ఖైదీగా జైల్లో మగ్గి బెయిల్‌పై బయటకు వచ్చారు. ప్రస్తుతం రెగ్యులర్ వాయిదాలకు విశాఖ ఎన్ఐఏ కోర్టుకు హాజరవుతున్నారు. ఈ కేసు నవంబరు 15కు వాయిదా పడింది. విచిత్రమేమంటే ఈ కేసులో బాధితుడుగా ఉన్న మాజీ సీఎం జగన్ ఒక్కసారి కూడా న్యాయస్థానంలో విచారణకు హాజరుకాకపోవడం.

ఏం జరిగిందంటే?: జగన్ 2018 అక్టోబర్ 25న హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయానికి వచ్చారు. వీఐపీ లాంజ్‌లో ఉండగా సెల్ఫీ తీసుకుంటానంటూ జనపల్లి శ్రీను వచ్చి, కోడి కత్తితో దాడి చేశారంటూ వైకాపా నాయకులు హడావుడి చేశారు. భుజానికి చిన్న గాయం అయిందంటూ వెంటనే విమానం ఎక్కి హైదరాబాద్ వెళ్లిన జగన్, అక్కడ లోటస్ పాండ్‌కు దగ్గరగా ఉన్న ఓ ఆసుపత్రిలో చేరారు. అయితే శ్రీను జగన్ వీరాభిమాని అని, జగన్‌పై సానుభూతి కోసం దాడి చేసినట్లు అప్పట్లో పోలీసులు తేల్చారు.

ఎన్నో మలుపుల మధ్య విశాఖకు చేరిన కేసు: ఈ కేసుపై దర్యాప్తునకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని జగన్ ఎన్ఐఏ విచారణ చేయాలని కోరారు. 2019లో ఎన్ఐఏ ఛార్జిషీటు దాఖలు చేసినా విచారణకు రావడానికి జాప్యమైంది. జనపల్లి శ్రీనుకు 2019 మే 22న బెయిల్ రాగా, ఆగస్టు 13న మళ్లీ జైలుకు సరెండర్ అయ్యారు. కారణం ఆ బెయిల్‌ను ఎన్ఐఏ...న్యాయస్థానంలో కొట్టివేయించింది. అప్పటి నుంచి బెయిల్ పిటిషన్‌పై విజయవాడ న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నాయి. కోడికత్తి కేసును అనూహ్యంగా విజయవాడ నుంచి 2023 ఆగస్టు 30న విశాఖ ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేశారు. అదే సమయంలో రాజమహేంద్రవరం కారాగారం నుంచి విశాఖ న్యాయస్థానానికి రావడానికి ఇబ్బందులున్నాయని, విశాఖ కేంద్ర కారాగారానికి శ్రీనును మార్చాలంటూ నిందితుడి తరఫు న్యాయవాది కోరడంతో కోర్టు అంగీకరించింది. 2023 సెప్టెంబరు నుంచి శ్రీను విశాఖ కేంద్ర కారాగారంలో మగ్గుతూ, 2024 ఫిబ్రవరిలో బెయిల్‌పై బయటకు వచ్చారు.

లోతైన దర్యాప్తు కావాలంటూ: కోడికత్తి కేసులో లోతైన దర్యాప్తు కావాలని, అదేవిధంగా వీడియోకాల్ ద్వారా కోర్టు విచారణకు అనుమతివ్వాలంటూ జగన్ తరఫు న్యాయవాదులు పిటిషన్లు వేశారు. ఇందులో లోతైన దర్యాప్తు అనే అంశంపై పిటిషన్‌ను విశాఖ కోర్టు కొట్టేసింది. మరో పిటిషన్ పెండింగ్ ఉండగానే, మళ్లీ జగన్ లోతైన దర్యాప్తు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించడంతో 8 వారాలు ఎన్ఐఏ కోర్టులో ప్రొసిండింగ్స్‌పై స్టే ఇచ్చింది. వచ్చే నెల 15న లోతైన దర్యాప్తుపై వేసిన పిటిషన్ హైకోర్టులో విచారణకు రానుంది.

'రావాలి జగన్..చెప్పాలి సాక్ష్యం.. అనేదే మా నినాదం. న్యాయస్థానంకు జగన్‌కు వస్తే నిజానిజాలు వస్తాయి. ఓపెన్ కోర్టులో సీన్ రీక్రియేషన్ చేసి జగన్ వాంగ్మూలం రికార్డు చేయాలనేది మా డిమాండ్' అని శ్రీను తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

ఉక్కులో సమ్మె విరమణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే : జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 28న విశాఖ ఉక్కులో సమ్మె చేపట్టేందుకు నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాలు...సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు శుక్రవారం అధికారులకు తెలిపారు. కర్మాగారంలో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అధికారులు తెలిపారు. సమావేశంలో అధికారులు ఎం.మధుసూదన్, షెహగల్, కార్మిక నాయకులు జె.రామకృష్ణ, ఎన్.రామచంద్రరావు, కె.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కవితకు పదోన్నతి

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 13 మంది సీనియర్ సివిల్ న్యాయమూర్తులకు జిల్లా న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను జారీచేసింది. వీరిలో విశాఖ ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కవిత ఉన్నారు. ఆమె పదోన్నతిపై గాజువాక ఎనిమిదో అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి:** విశ్వం, కళ్లు కంపౌండ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, **ఆడి2:** వెట్టయన్, ఇద్దరు, **ఆడి3:** దేవర, **ఆడి4:** రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, **రాజు:** వెట్టియన్, విశ్వం, **బంగారురాజు:** దేవర **చోడవరం:** **శ్రీసాయిలక్ష్మి:** విశ్వం, **సాయిలక్ష్మి:** వెట్టయన్, **పూర్ణా:** దేవర

సభ్యత్వ నమోదులో ముందుండాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదులో కె.కోటపాడు మండలం ముందుండాలని భాజపా సీనియర్ నాయకుడు చల్లా సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కె.కోటపాడులో శుక్రవారం పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. నెలాఖరులోగా ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. భాజపా మండల అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు, సూర్యనారాయణ, వెంకటరావు, పైల అమ్మాజీ పాల్గొన్నారు.

నెరవేరని స్వచ్ఛ లక్ష్యం



చోద్యంలో తుప్పలు పెరిగి నిరుపయోగంగా..

గొలుగొండ, న్యూస్‌టుడే: పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో కీలకమైన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మాత్రం లక్ష్యానికి దూరంగా ఉండిపోయాయి. 2014-19 మధ్య అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ప్రతి పంచాయతీలో జనాభా సంఖ్యను బట్టి రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పైగా నిధుల వ్యయంతో సంపద కేంద్రాల నిర్మాణాలు జరిగాయి. 2017-18లో ప్రతి మండలంలో ఎంపిక చేసిన కొన్ని చోట్ల తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేశారు. అంతేకాకుండా సంపద కేంద్రాల చుట్టూ ఖాళీ స్థలాల్లో అందమైన పూల మొక్కలు నాటి, కాయగూరలు, ఆకుకూరలు పండించి ఆహ్లాదకరంగా తయారు చేశారు. 2019లో అన్నీ ఓ గాడిలో పడే తరుణంలో పాలన చేతులు మారింది. వైకాపా సర్కారు రూ. లక్షలు ప్రజాధనంతో నిర్మించిన వీటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో 80 శాతం షెడ్లు నిరుపయోగంగా మారడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చినప్పుడే గ్రామాల్లో పరిశుభ్రతకు అవకాశం ఉంటుంది.



ఎ.ఎల్.పురంలో వాడుకలో లేని సంపద కేంద్రం



ఎ.ఎల్.పురం-కొంగసింగి రహదారి పక్కన చెత్తగుట్ట

కొత్తకోట పీఏసీఎస్‌లో అవినీతి రాజ్యం?

కలెక్టర్, డీసీసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు

రావికమతం, న్యూస్‌టుడే

కొత్తకోట పీఏసీఎస్‌లో అవినీతి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా సొసైటీ సీఈవో (కార్యదర్శి) పంట రుణాలు మంజూరు, చెల్లింపు విషయంలో సభ్య రైతులను అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని చెబుతున్నారు. సొసైటీకి వచ్చేవారిపై, రుణాలు చెల్లించని రైతులపై కేకలు వేయడం, నోటి దురుసుతో అతిగా ప్రవర్తించడం, బెదిరించడం, అవమానపర్చేలా వ్యవహరిస్తుంటారని రైతులు చెబుతున్నారు.

పంట రుణం తీసుకున్నప్పుడు, చెల్లించేటప్పుడు సహకార సంఘం అధికారి చేతులు తడపాల్సి వస్తోందని కొత్తకోట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్ట్‌గేజ్ రుణం చెల్లించాక రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లి క్లియరెన్సు ధ్రువపత్రం తేవాలని ఖర్చుల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగుల్లో కొందరు సీఈఓ మార్గంలోనే నడుస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అధికారి అవినీతిపై గంపవానిపాలెం, కిత్తంపేటకు చెందిన ఓ మహిళా రైతు సహా పలువురు స్పందనలో కలెక్టర్‌కు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

గంపవానిపాలెంకు చెందిన గవిరెడ్డి కొండనాయుడు 2015లో కొత్తకోట పీఏసీఎస్‌లో రూ. 1.50 లక్షలు పంట రుణం తీసుకున్నారు. వ్యవసాయం కలిసిరాక సకాలంలో చెల్లించలేకపోయారు. వడ్డీతో కలిపి మొత్తం అప్పు రూ. 3.09 లక్షలు అయింది. రైతు కొండనాయుడు గత నెలలో మృతి చెందారు. 'భర్త తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఎటువంటి ఆదాయ మార్గం లేదు. ఒన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా తీసుకున్న రుణం మాత్రమే చెల్లించేందుకు అవకాశం కల్పించాల'ని భార్య వరహాలమ్మ ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే సీఈవో రఘు రుణం చెల్లించాలంటూ తనను తిట్టడం, భయపెట్టడం చేస్తున్నారని పేర్కొన్నారు. లంచం ఇవ్వనిదే ఆయన రుణ ప్రతిపాదనలు చేయడంలేదని సభ్య రైతులైన కిత్తంపేటకు చెందిన మారాజు సత్తిబాబు తెలిపారు. రుణం తీసుకున్నప్పుడు, చెల్లించేటప్పుడు డబ్బులు డిమాండు చేస్తున్నారని గంపవానిపాలెంకు చెందిన వంటాకుల మహేష్ ఆరోపించారు. తాకట్టు చెల్లించాక క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లి తీసుకురావాలని చెప్పి డబ్బులు వసూలు చేశాడన్నారు. అవినీతికి పాల్పడుతున్న సీఈఓపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పలువురు రైతులు సంతకాలు చేశారు.



విచారణ చేస్తున్న బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్

విచారణ చేశాం

'సీఈవో రఘుపై గంపవానిపాలెంకు చెందిన గవిరెడ్డి వరహాలమ్మ స్పందనలో కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై గ్రామానికి వెళ్లి విచారణ జరిపాము, నివేదికను డీసీసీబీ జిల్లా ఉన్నతాధికారులకు పంపించాం. ఈ సీఈవోపై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయని తెలిసింది. కిత్తంపేట, గంపవానిపాలెం రైతులు డీసీసీబీ ఉన్నతాధికారులకు పంపించిన ఫిర్యాదు ఇంతవరకు మా దృష్టికి రాలేదని, ఉన్నతాధికారులు ఆదేశిస్తే వాటిపైనా విచారణ చేస్తామ'ని డీసీసీబీ రావికమతం బ్రాంచి మేనేజర్ ఎల్.దుర్గాప్రసాద్ తెలిపారు.

బస్టాండులో విస్తృత తనిఖీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఇక్కడ పోలీసులు గంజాయిపై నిఘా తీవ్రతరం చేశారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో గంజాయి వాసనను పసిగట్టగలిగే జాగిలంతో అన్నింటిని నిశితంగా పరిశీలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు ఆధ్వర్యంలోని పోలీసులు బస్సుల్లోని ప్రయాణికుల లగేజీ, పార్శిళ్లు ఇతరత్రా సోదా చేశారు. గంజాయి తదితర మత్తు పదార్థాల రవాణా అరికట్టడానికే వీటిని చేపడుతున్నామని ఈ సందర్భంగా సీఐ తెలిపారు. వీటి సమాచారం తెలిసిన వారు వెంటనే తమకు తెలియజేయవచ్చన్నారు. ఇందులో సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జాగిలంతో పార్శిళ్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

సాలాపువానిపాలెంలో చోరీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధి సాలాపువానిపాలెంలో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వి.మాడుగుల మండలం ఎం.కోడూరుకు చెందిన మైచర్ల అప్పారావు పరవాడ ఫార్మాసిటీలో కార్మికుడిగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి సాలాపువానిపాలెంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. తమ కుమార్తె ఆధార్ కార్డు నవీకరణ నిమిత్తం భార్య పిల్లలతో కలిసి గురువారం స్వగ్రామం ఎం.కోడూరు వెళ్లారు. శుక్రవారం ఉదయం సాలాపువానిపాలెం వచ్చి ఇంటి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఉన్న 7.5 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు దుండగులు అపహరించుకుపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనకాపల్లి అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు.

పైపులైన్ గొయ్యి పూడ్చివేత

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముఖద్వారంలో పైపులైన్ నిర్మాణానికి తవ్విన గొయ్యిను ఎట్టకేలకు పూడ్చివేశారు. జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా హైస్కూల్ ముఖ ద్వారంలో ప్రమాదకరంగా గొయ్యిను తవ్వి కొన్ని రోజులుగా వదిలేశారు. దీనిపై 'తవ్వి వదిలేస్తే ఎలా' శీర్షికన ఈనెల 15న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి పైపులైన్ గొయ్యి పూడ్చి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. దీంతో పాఠశాల విద్యార్థులు సంతోషిస్తున్నారు.



చీడికాడ హైస్కూల్ మార్గంలో పూడ్చిన పైపులైన్ గొయ్యి

పోటీ పరీక్షలతో భావవ్యక్తీకరణ నైపుణ్యం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలు విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచు ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాస రచన పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన ఈ పోటీలో 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభకు పదును పెడుతున్న 'ఈనాడు' కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ప్రశంసించారు. అంతర్జాలంలో మంచి చెడులను విద్యార్థులు తమ వ్యాసాల్లో చక్కగా విశ్లేషించారు. ఉపాధ్యాయులు చలపతిరావు, బాబి మాస్టారు, అల్లు అప్పారావు, రాజేశ్వరరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన కేశకర్తి పూర్ణచంద్, బీడా నిఖిల్, మాకిరెడ్డి చరిష్మాకు ప్రధానోపాధ్యాయుడు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం ఫ్రాన్సిస్

ఆవుపాల ధర తగ్గింపుపై 29న మహాధర్నా

కె.కోటపాడు, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ ఆవుపాల ధర తగ్గించడాన్ని నిరసనగా 29న విశాఖ డెయిరీ వద్ద నిర్వహించే మహాధర్నాకు పాడి రైతులంతా హాజరు కావాలని పాలుత్పత్తిదారుల సంఘం నాయకులు గండి నాయనబాబు కోరారు. లంకవానిపాలెం, పిండ్రంగి, చిట్టెంపల్లి అగ్రహారం, గవరపాలెం, కొరువాడ గ్రామాల్లో శుక్రవారం పాడి రైతులను సంఘ నాయకులతోపాటు కలిసి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు, నాయుడుబాబు, పెనగంటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలు పెంపు, విశాఖ డెయిరీ రైతుల పాల ధర తగ్గింపు తదితర సమస్యలపై నవంబరు 1 నుంచి జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. దేవరాపల్లి సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. వ్యవసాయం చేసే అన్నదాతలకు గిట్టుబాటు ధర లేక పోవడంతో పాడి పైనే మొగ్గు చూపుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాడిపై ఆధారపడి సుమారు 3 లక్షల రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారు ఉత్పత్తిచేసే పాలధరను విశాఖ డెయిరీ తగ్గించిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యంపై పాడిరైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు హాజరు కావాలని మహిళలను కోరుతున్న రైతు సంఘం నాయకులు నాయనబాబు

అ వీ ఇ వీ

మండల పరిషత్తు సమావేశాలు నేడు

మాడుగుల గ్రామీణం, చీడికాడ, న్యూస్‌టుడే: మాడుగుల, చీడికాడ మండల పరిషత్తు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు కొంకి అప్పారావు, హేమసుందరరావు పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులంతా హాజరు కావాలని పూర్తిస్థాయి సమాచారంతో రావాలని కోరారు.

మహాసభలు జయప్రదం చేయండి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విజయనగరంలో వచ్చే నెల 27 నుంచి 30 వరకు జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం మహాసభల కరపత్రాలను స్థానిక ఎంఈఓ తలుపులతో కలిసి ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: నిరక్షరాస్యులను గుర్తించి ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని పారిశ్రామిక ప్రోత్సాహ అధికారి త్రివేణి సూచించారు. వెలుగు వీఓలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకంపై సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయకర్త రాజేశ్వరి, అప్పలరాజు, ఏఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి మృతి

చోడవరం, న్యూస్‌టుడే: సీమునాపల్లి గ్రామ శాఖ తెదేపా మాజీ అధ్యక్షుడు శరగడం శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ భార్య ఉమ సీమునాపల్లి సర్పంచిగా 2013 నుంచి 2018 వరకు పనిచేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, సర్పంచులు దొడ్డి అప్పారావు, మొల్లి ఈశ్వరరావు, బొడ్డేడ రాము నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

తుప్పలతో దడ

చీడికాడ, న్యూస్‌టుడే: అర్జునగిరి - చీడిపల్లి రోడ్డు తుప్పలతో ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగి సగం వరకు రోడ్డును కప్పేశాయి. ఈ దారిలో విష కీటకాల సంచారంతో వాహన చోదకులు, పాదచారులు భయపడుతున్నారు. మలుపుల్లో వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తురువోలు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు దట్టంగా ఉన్నాయి. అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పైడిపాల కూడలి నుంచి బూరుగుపాలెం వెళ్లే రహదారిలో మలుపులు కనిపించకుండా తుప్పలు పెరగడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు రహదారి కనిపించకుండా మూసేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కొత్తకోటకు చెందిన యువకులు ఆటోను తప్పించే క్రమంలో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



చీడిపల్లి రోడ్డుపైకి సగానికి వ్యాపించిన తుప్పలు



పైడిపాల రహదారి మలుపులో ప్రమాదకరంగా పెరిగిన తుప్పలు

గుంతల దారిలో తంటాలు

నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధాన రహదారి గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుమీద గోతులు పడి ఇప్పటికి నాలుగేళ్లు దాటిందని కాలనీవాసులు చెబుతున్నారు. వర్షాలు పడ్డ ప్రతిసారీ గోతుల లోతు పెరుగుతోంది. గోతుల లోతు అంచనా వేయలేక వాహన కిందపడి అనేకమంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఈ దారిలోనే వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

– గొలుగొండ, న్యూస్‌టుడే



గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద..

నిలిచిన సిమెంట్ లారీ.. రాకపోకలకు అవస్థలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సిమెంటు లోడుతో ఎం.అలమండ వైపు వస్తున్న భారీ లారీ శుక్రవారం రోడ్డు మలుపులో అదుపు తప్పి రోడ్డుకి అడ్డంగా నిలిచిపోయింది. దీంతో వారాడ నుంచి ఎం.అలమండ మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గం మీదుగా వెళ్లాల్సిన ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకోడానికి నానా అవస్థలు పడ్డారు. ఈ రోడ్డులో అనేక మలుపులున్నాయి. చిన్న లారీలు మలుపులు తిరగడానికే చాలా కష్టంగా ఉంటుంది. అలాంటిది.. భారీ లారీ ఈ మలుపులు తిరగాలంటే ఎంత కష్టమో తెలీక ఈ మార్గంలో వచ్చిన ఈ లారీ ఇదిగో ఇలా ఇరుక్కుపోయింది.



కొత్త సాంకేతికతతో రైతులకు సేవలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా రైతు సేవాకేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బంది చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) శ్రీదేవి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ డివిజన్‌లోని సిబ్బందికి ఏర్పాటైన నైపుణ్య శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కొత్త సాంకేతికతతో సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకొని రైతుల ముంగిటే సేవలన్నీ విస్తృతమవ్వాలన్నారు. ఇందులో డివిజన్‌లోని వ్యవసాయాధికారులు అప్పారావు, విజయలక్ష్మి, సుధారాణి, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

ప్రతినెలా మెప్మా బజారు ఏర్పాటు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రతి నెలాఖరున నర్సీపట్నం, ఎలమంచిలిలో మెప్మా బజార్ ఏర్పాటు చేస్తున్నామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంస్థాగత నిర్మాణకర్త వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో దాదాపు వెయ్యి సంఘాల్లోని మహిళలు అనేక రకాల వస్తువులు తయారు చేస్తున్నారని తెలిపారు. నర్సీపట్నంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మా బజారును ఆమె పరిశీలించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు విచ్చేసి సరకులు కొనుగోలు చేశారు.



చీర పరిశీలిస్తున్న వరలక్ష్మి తదితరులు

రీసర్వేలో తప్పులను సరిచేస్తాం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: వినతులు అందిస్తే భూముల రీసర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరిచేస్తామని తహసీల్దారు భాగ్యవతి పేర్కొన్నారు. మేడిచర్లలో శుక్రవారం గ్రామ సభ జరిగింది. 29 మంది రైతులు తహసీల్దారు భాగ్యవతికి వినతిపత్రాలు అందించారు. తెదేపా నాయకులు పూడి నారాయణమూర్తి, పూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: పనసలపాడులో తాము సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆదివాసీ గిరిజనులు డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్ ఆధ్వర్యంలో భూసమస్యలకు సంబంధించి గిరిజనులు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. గతంలో కొంతమంది అధికారుల అండదండలతో ఆదివాసీ గిరిజన జిరాయితీ భూములకు సంబంధించి అక్రమంగా పట్టాలు పొందారని సర్వే నంబరు 6/1లో ఈ ప్రాంత గిరిజనులు సుమారు 30 సంవత్సరాలుగా సాగులో ఉన్నప్పటికీ సాగులో లేనివారు పట్టాలు పొందారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఆదివాసీ గిరిజన నాయకులు గెమ్మిలి చిన్నబ్బాయి, గెమ్మిలి నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం బైలపూడిలో శుక్రవారం రెవెన్యూ రీ సర్వే గ్రామసభ జరిగింది. గతంలో చేసిన రీ సర్వే తప్పులపై 26 మంది గ్రామసభలో తహసీల్దార్ ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామసభలో వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగతల్లి, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నం, తెదేపా నాయకుడు అధ్యక్షుడు గణపతి, కూటమి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం ఖండివరంలో గ్రామసభ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.



పనసలపాడు గ్రామసభలో వినతుల స్వీకరణ

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

చీడికాడ, న్యూస్‌టుడే:

?: కోనాం-గుడివాడ మార్గంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకంగా ఒరిగిపోయింది. ఇది ఏమాత్రం కూలిపోయినా.. నాలుగైదు గిరిజన గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుంది.

– కృష్ణ, గుడివాడ



✓: తక్షణమే పరిశీలించి, గుత్తేదారుచే విద్యుత్తు స్తంభాన్ని సరి చేయిస్తాను.

– వెంకటరావు, ఏఈ, చీడికాడ.

నర్సీపట్నం, న్యూస్‌టుడే

?: శారదానగర్‌లో బోంబే టైలర్ వీధిలో రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో చెత్త చెదారాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

– కె.నారాయణ, నర్సీపట్నం

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలను తొలగిస్తాం. – చిట్టిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

చోడవరం, న్యూస్‌టుడే

?: చోడవరం పట్టణంలో వేపా వారి వీధిలో 24 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. – నున్న నాగేశ్వరరావు, వస్త్ర వ్యాపారి

✓: రెండు రోజుల్లో వీధి దీపాలు కొత్తవి వేయిస్తాం. – నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి

రావికమతం, న్యూస్‌టుడే

?: మేడివాడ గ్రామంలోని అంగన్‌వాడీ-1 కేంద్రం ఆవరణలోని చేతిబోరు వద్ద నీరు నిలిచిపోయి, తాచుపట్టి కంపు కొడుతోంది. దుర్వాసనతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

– ఆర్.వెంకట్రావు, మేడివాడ

✓: చేతిబోరు వాడుక నీరు బయటకు పోయేలా మార్గం ఏర్పాటు చేసి, మురుగు నీరు నిలిచిపోకుండా, చిన్నారు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం. – వజ్రపు లీలా శివ, సర్పంచి, మేడివాడ



పాడి పరిశ్రమ అభివృద్ధికే పశుగణన



దేవరాపల్లిలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సర్పంచి పెంటమ్మ, భాస్కరరావు, రాజేశ్వరి

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: పాడి రైతులకు ఎంతో ఉపయోగపడే పశువుల సమగ్ర సమాచార సేకరణకు సంపూర్ణ సహకారం అందించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు దినేశ్‌కుమార్ కోరారు. కె.కోటపాడులో శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, పైడమ్మపేటలో తెదేపా మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్ ప్రారంభించారు. సర్పంచులు రొంగలి రాఘవనాయుడు, భవాని పాల్గొన్నారు. దేవరాపల్లిలో పశుగణన గోడపత్రికలను సర్పంచి సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, రాజేశ్వరి ఆవిష్కరించారు.

గొలుగొండ, మాడుగుల గ్రామీణం: ప్రస్తుతం దేశజనాభాకు అవసరమైన పాల ఉత్పత్తి లేదని, పాడి పశువుల సంఖ్య తెలిస్తే వాటిని పెంచేందుకు అవసరమైన అంచనా వస్తుందని గొలుగొండ పశువైద్యాధికారి ఎల్.రమేష్ పేర్కొన్నారు. పాతమల్లంపేటలో సచివాలయం వద్ద సమావేశమై సర్పంచి ఆదిలక్ష్మితో కలిసి ప్రచార పోస్టర్‌ను విడుదల చేసి రైతులతో మాట్లాడారు. పశుగణన కోసం మాడుగుల, చీడికాడ మండలాలకు మణి లక్ష్మణ్, అరుణకిరణ్, గాయత్రిదేవి, రాఘవమ్మలను సూపర్‌వైజర్లుగా నియమించినట్లు మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు అధికారి చిట్టినాయుడు తెలిపారు. ఎంపీడీఓ కొంకి అప్పారావు చేతుల మీదుగా గోడపత్రిక విడుదల చేశారు.

మాకవరపాలెం, రావికమతం, న్యూస్‌టుడే: పశుగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మాకవరపాలెం పశు వైద్యాధికారులు ప్రతాప్, అనిల్ కోరారు. శుక్రవారం స్థానిక పశు వైద్యశాల వద్ద గోడపత్రికలను ఆవిష్కరించారు. రోలుగుంట, రావికమతం మండలాల్లోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి పశు గణన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏడీఏ టి.పుష్ప తెలిపారు. ఇందుకోసం రావికమతం మండలంలో 10 మంది, రోలుగుంటలో 9 మంది సిబ్బందిని నియమించామన్నారు. రెండు మండలాలకు సూపర్‌వైజర్లుగా పశు వైద్యాధికారులు సురేష్, నూకేష్, బాలతేజ, మౌనికలను నియమించామని చెప్పారు.

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - (మార్నింగ్, మ్యాట్నీ), దేవర (ఫస్ట్, సెకెండ్ షో) స్క్రీన్-2- విశ్వం

పెందుర్తి

నేడు తెదేపా సభ్యత్వ నమోదు

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఇరువాడలోని జి.ఎస్. కల్యాణ మండపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెదేపా కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ముఖ్యఅతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలను తక్షణమే నియంత్రించాలని సీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో చినముషిడివాడలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. అనంతరం చినముషిడివాడ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, సభ్యులు అసిరినాయుడు, ఎం.రాము, దుర్గారావు, మిన్నారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

శ్రీనివాసుడికి వైభవంగా తిరుమంజనం


శ్రీనివాసుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం వైభవోపేతంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేద మంత్రాల నడుమ కలియుగ దైవానికి పంచామృతాలు, ఫలోదకాలతో తిరుమంజనం నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పశుగణనతో అన్నదాతలకు మేలు

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: అఖిల భారత 21వ పశుగణన కార్యక్రమాన్ని సబ్బవరం మండలానికి సంబంధించి గుల్లేపల్లిలో శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి పశుజాతులను నమోదు చేస్తారని పాడి రైతులు కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. పశువైద్యాధికారిణి సంధ్య మాట్లాడుతూ పశుగణన పాడి రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బండారు మంగ, బోను దేముడమ్మ, నాయకులు శ్రీను, గంగునాయుడు, పశువైద్యాధికారిణి సంధ్య పాల్గొన్నారు.


పశుగణన గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, అధికారులు

27న బీచ్ రోడ్డులో లేజర్ షో

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భారత్-పాక్(1971) యుద్ధానికి సంబంధించిన దృశ్యాలతో ఈనెల 27న బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' స్తూపం వద్ద లేజర్ ప్రదర్శన ఉంటుందని జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు తెలిపారు. యుద్ధ వీరుల సాహసోపేతాలతోపాటు, దేశ చరిత్ర, ఘనతలను తెలిపేలా ఇకపై ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు లేజర్ షో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరు.. పరిష్కారం దొరకదు..


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు


మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

పెందుర్తి, న్యూస్‌టుడే

ప్రజా సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరు కాకుంటే అక్రమాలపై ఎవరిని ప్రశ్నించాలని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి నిలదీశారు. పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గనుల శాఖ అధికారులు, తహసీల్దార్ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపీపీ, పంచాయతీల ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌పురంలో యథేచ్ఛగా కొండపై మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గనుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తహసీల్దార్ హాజరుకాకుండా ఇతర అధికారులను పంపడంతో రెవెన్యూ సంబంధిత సమస్యలపై స్పష్టమైన పరిష్కారం లభించడం లేదని వాపోయారు. వచ్చే సమావేశంలో తప్పనిసరిగా అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావును ఆదేశించారు.

సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు..

★ గుర్రమ్మపాలెంలో జగనన్న కాలనీ నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదని ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే కాలనీని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీని కోరారు.

★ చింతగట్ల పంచాయతీలో కొండవాలు ప్రాంతంలో 17 ఇళ్ల స్థలాలు కేటాయించారని, నిర్మాణానికి అనుకూలంగా లేదని ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు పేర్కొన్నారు. కొండ స్థలాన్ని చదును చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు అవకాశం కల్పించాలని కోరారు.

★ చింతగట్ల, జెర్రిపోతులపాలెం గ్రామాల్లో ఇటీవల పల్లె పండగ వారోత్సవాల్లో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలకు తమకు సమాచారం ఇవ్వలేదని, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, చింతగట్ల సర్పంచి జి.వెంకటలక్ష్మి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా మరోసారి శంకుస్థాపన చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మణరావుకు చెప్పారు.

★ గృహనిర్మాణ శాఖ ఏఈ దీపక్ మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ప్రజా ప్రతినిధులను కోరారు. దీనిపై జంగాలపాలెం సర్పంచి గొరపల్లి నరసింగరావు మాట్లాడుతూ తమ గ్రామంలో శ్మశానంలో స్థలాలు కేటాయించారని, కనీసం రోడ్డు కూడా లేని ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇదే విషయంపై ప్రశ్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇళ్ల స్థలాల వద్దకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని అధికారులు సమాధానమిచ్చారు.

★ ఎన్‌డీబీ నిధులు విడుదల కాకపోవడం వల్ల మండలంలోని పలురోడ్ల నిర్మాణం కాకుండా నిలిచిపోయాయని ర.భ.శాఖ ఏఈ ఎం.నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

★ మండలంలోని పలు గ్రామాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి స్టాంపు డ్యూటీ జమ కాలేదని గొరపల్లి సర్పంచి గొరపల్లి శ్రీను పేర్కొన్నారు. సుమారు రూ.5 కోట్ల మేర బకాయిలను రప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ★ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, ఉప ఎంపీపీలు చిరికి దేముడు, దాడి వరలక్ష్మి, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, ఉప తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీటీసీ సభ్యులు గండి హిమబిందు, సైపురాజు స్వప్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో ఉచిత శిక్షణ

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: సాంకేతిక విద్య అయిన ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రహ్లాదపురం దరి శ్రీనివాసనగర్‌లోని ఎస్.వి.సొల్యూషన్స్ డైరెక్టర్ బోగిపాటి ఆదిమూర్తి తెలిపారు. సంస్థ ప్రాంగణంలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగలవారు శ్రీనివాసనగర్‌లోని తమ కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపాధికి ఉపయోగపడే ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు.


ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎస్‌వీ పవర్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఆదిమూర్తి

అప్రెంటీస్ మేళాకు స్పందన

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి మంత్రిపాలెంలోని హైటెక్ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 117 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మేళాకు ఎంపికైన విద్యార్థుల వివరాలను త్వరలోనే ప్రకటించడంతో పాటు చరవాణికి సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు శ్రీనాథ్, కార్తికేయన్, ప్రేమ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ అక్కిరెడ్డి దుర్గినాయుడు, నిస్ట్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


మేళాకు హాజరైన అభ్యర్థులు

ఖాళీ స్థలాల్లో మాంసం వ్యర్థాల పారబోత

వేపగుంట, న్యూస్‌టుడే: రహదారుల పక్కనున్న ఖాళీ స్థలాల్లో కొంతమంది వ్యాపారులు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా మాంసం వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు, ఉదయం నడకదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేపగుంట – గోశాల ప్రధాన రహదారిలో మాంసం దుకాణదారులు కోళ్ల వ్యర్థాలు, గొర్రె, మేక చర్మాలు పడేయడంతో అవి కుళ్లి భరించలేని వాసన వస్తోందని పరిసర ఇళ్లలోని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొంతమంది వేపగుంటవాసులు రహదారుల పక్కన బహిరంగ మల విసర్జన చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

భాజపాలోకి వైకాపా కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, వైకాపా నాయకుడు ముమ్మన దేముడు భాజపాలో చేరనున్నారు. చినముషిడివాడలో శనివారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సమక్షంలో భాజపా కండువా వేసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. వార్డు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ముమ్మన తెలిపారు.

తెదేపా, జనసేన నేతల అభ్యంతరం

కార్పొరేటర్ ముమ్మన దేముడు భాజపాలో చేరికపై జనసేన, తెదేపా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో కూటమి నాయకులకు వ్యతిరేకంగా పనిచేసిన ముమ్మన దేముడిని ఎలా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి భాజపాలో చేరాలని సూచించారు. 95, 97వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు దాట్ల మధు, శానాపతి సోమశేఖర్ నాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు కరక దేముడు, సరిపల్లి సర్పంచి గొర్లె రామకృష్ణ ఇతర నాయకులు పాల్గొన్నారు.

'టెక్స్‌టైల్ రంగం'పై ప్రత్యేక శిక్షణ

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: టెక్స్‌టైల్ రంగంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కోర్సు ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. శుక్రవారం దువ్వాడ ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రాండిక్స్ అపెరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారి ప్రతిభ ఆధారంగా పరిశ్రమలో గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమిస్తారని కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఎ.నాగజ్యోతి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ యువజన క్రీడా విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు కారణమైన వృక్షసంపద, వాటి పెంపకం పర్యవసానాలు గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి శీలాప్రసాద్ మాట్లాడారు. యువత ఎటువంటి వ్యసనాలు పాటించడం వల్ల మత్తుకు బానిస కాకుండా ఉంటారో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ గణేశ్, గోవిందరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

గ్రామసభలతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: రెవెన్యూ గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని లగిశెట్టిపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. మొత్తం 59 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, సర్పంచి పాలిశెట్టి పార్వతి, ఉపఎంపీపీ ఝాన్సీ లక్ష్మీరాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

నేడు పి.భోనంగిలో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగిలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న సభలో భూ సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు.

మర్యాద పూర్వక కలయిక



మంత్రులు డి.బి.వీరాంజనేయ స్వామి, కందుల దుర్గేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. అనంతరం నోవోటెల్ హోటల్‌లో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను కలిశారు. ఇరువురు మంత్రులను శాలువతో సత్కరించారు.

బాణసంచా రవాణాపై ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: బస్సుల్లో బాణసంచా, మత్తుపదార్థాలు వంటివి అక్రమంగా రవాణా చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజా రవాణా(ఆర్టీసీ) ఇన్‌ఛార్జి అధికారి బి.అప్పలనాయుడు సూచించారు. ఇన్‌ఛార్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా సింహాచలం ఆర్టీసీ డిపోను ఆయన శుక్రవారం సందర్శించారు. ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ, ప్రయాణికులతో స్నేహపూర్వకంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. నిషేధిత వస్తువులు తరలించే వ్యక్తులు ఆర్టీసీ సిబ్బందిపై తిరుగుబాటు చేసే ప్రమాదముందని అప్రమత్తంగా ఉంటూ వారిని పోలీసులకు ఎలా అప్పగించాలో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా ఇన్‌ఛార్జి అధికారి బి.అప్పలనాయుడు

జనవరికి ప్రసాద్ పథకం పనులు పూర్తి చేయండి

సింహాచలం, పద్మనాభం, న్యూస్‌టుడే: సింహాచలం క్షేత్రంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులు వచ్చే జనవరి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రసాద్ పథకం పనులపై శుక్రవారం సింహగిరిపై ఆయన సమీక్ష నిర్వహించారు. దేవాలయంలో చందనోత్సవం వంటి ప్రధాన ఉత్సవాలు సమీపించే నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. సింహాచలం క్షేత్రానికి ఉన్న బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా ఈ పనులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇవి ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలన్నారు. యాగశాల నిర్మాణం, రామానుజ కూటము, యాంపీ థియేటర్, పుష్కరిణి సత్రం వద్ద వసతి గదులు, తదితర వాటన్నింటినీ దేవస్థానం అధికారుల సమన్వయంతో నిర్మాణం చేపట్టాలని సూచించారు. సింహగిరి బస్‌స్టాండు వద్ద పర్యాటక శాఖ సమాచార కేంద్రం నిర్మాణంపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ అభ్యంతరం వ్యక్తం చేసినా పనులు కొనసాగించడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్ష అనంతరం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. సతీ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, దేవాదాయశాఖ సీఈలు దుర్గేశ్, శేఖర్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఈఈ కె.రమణ, ఏఈ మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు. * అనంతరం కమిషనర్ పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ మరమ్మతు పనులను పరిశీలించారు. దీపోత్సవం నాటికి ఈ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. గతంలో పిడుగుపాటుకు గురైన ఆలయ శిఖరాన్ని సీజీఎఫ్ నిధులు రూ.60లక్షలతో ఇక్కడ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్.శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.సి.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.దుర్గేష్‌కుమార్, ఏసీ అన్నపూర్ణ, ఆలయ ఈవో నానాజీబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాలాపువానిపాలెంలో భారీ చోరీ


బాధితులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధి సాలాపువానిపాలెంలో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వి.మాడుగుల మండలం ఎం.కోడూరుకు చెందిన మైచర్ల అప్పారావు పరవాడ ఫార్మాసిటీలో కార్మికుడిగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి సాలాపువానిపాలెంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. తమ కుమార్తె ఆధార్ కార్డు నవీకరణ నిమిత్తం భార్య పిల్లలతో కలిసి గురువారం స్వగ్రామం ఎం.కోడూరు వెళ్లారు. శుక్రవారం ఉదయం సాలాపువానిపాలెం వచ్చి ఇంటి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఉన్న 7.5 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు దుండగులు అపహరించుకుపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనకాపల్లి అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అదుపుతప్పితే అంతే సంగతులు

దర్పణం



జీవీఎంసీ 77వ వార్డు పరిధి పెదపాలెం నుంచి ఇస్లాంపేట వెళ్లే రహదారిలోని కల్వర్టుల వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో ఉన్న రెండు కల్వర్టులకు రక్షణ గోడలు లేని కారణంగా బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ ఏమాత్రం అదుపుతప్పినా గెడ్డలో పడి భారీమూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల సమయంలో గెడ్డ ఉద్ధృతంగా ప్రవహించడంతో రోడ్డు పైనుంచి వరద పారుతుంటుందని ఆ సమయంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పరవాడ

దారితప్పిన వృద్ధురాలు.. బంధువులకు అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే: మతిమరుపు సమస్యతో దారి తప్పిపోయి సంచరిస్తున్న ఓ వృద్ధురాలిని పెందుర్తి పోలీసులు శుక్రవారం ఆమె బంధువులకు అప్పగించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్ల కంచరపాలెం ప్రాంతానికి చెందిన రమణమ్మ(70)కు మతిమరుపు సమస్య ఉంది. ఆమె దారి మరచిపోయి వేపగుంట దరి కృష్ణరాయపురం వచ్చేసింది. స్థానిక టీచర్స్ లేఅవుట్‌లో ఆమె దిక్కుతోచక సంచరిస్తుండగా కాలనీకి చెందిన శ్రీనివాస్ డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందించాడు. పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ ఆదేశాలపై బ్లూకోల్ట్ కానిస్టేబుల్ ఎం.గోవిందు ఆమె వద్ద వివరాలు సేకరించి కంచరపాలెం పోలీసుల సాయంతో ఆమె బంధువులకు సమాచారం అందించారు. ఆమె బంధువులు ప్రసాద్, అజయ్‌కు వృద్ధురాలిని అప్పగించారు. పోలీసుల సహకారానికి వృద్ధురాలి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


రమణమ్మను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు